
J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 12.06.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 02 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com





● తెలుగుదేశంలో...

## తిరుగుబాటు తప్పదా?

- వరుసబెట్టి పార్టీని వీడుతున్న నేతలు
- నైరాశ్యంలో టిడిపి శ్రేణులు
- బాబు నాయకత్వంపై సడలిపోతున్న నమ్మకం
- ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న అభిమాన గణం

మూడున్నర దశాబ్దాల రాజకీయ చరిత్రలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ లేనటువంటి గడ్డు పరిస్థితిని నేడు ఎదుర్కొంటోంది. 2019 ఎన్నికల దారుణ పరాభవ ఆనవాళ్ళు ఇప్పటికీ అలానేవున్నాయి. తిమ్మిని బమ్మిని చేసైనా చంద్రబాబు పార్టీని అధికారంలోకి తెస్తాడనుకున్నవారి భ్రమలు పటాపంచలయ్యాయి. చంద్రబాబును ఇంతకాలం నాయకుడిగా నిలబెట్టింది పచ్చమీడియానే! (మిగతా 11వ పేజీలో)

● నిమ్మగడ్డ కేసులో

## రెండు వారాల గడువు

- హైకోర్టు తీర్పుపై స్టేకి నిరాకరణ
- ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసిన సుప్రీం

ప్రజాక్షేత్రంలో ఘనవిజయం సాధించాడు... సంక్షేమ పథకాలతో ప్రజల్లో దూసుకు పోతున్నాడు... అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 90శాతం నెరవేర్చాడు. పరిపాలనానుభవం (మిగతా 11వ పేజీలో)

## జననేతకు అభినందన



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గారు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 11వ తేది గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి అభినందిస్తున్న 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు). రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన ముఖ్యమంత్రిని కలిసాడు.



● వైసిపిలో వర్గపోరు

## అనిల్ Vs ఆనం

- పొలిటికల్ హీట్ పెంచిన ఫైట్
- మంత్రిపై అసమ్మతి రాగాలాపన



నెల్లూరుజిల్లాలో ఏడాది కాలంగా స్వచ్ఛంగా వున్న రాజకీయాలు ఇటీవలే ఒక్కసారిగా వేడెక్కడం మొదలయ్యాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు ఓపక్క కాక రేపుతుండగా, ఇంకోపక్క అధికార పార్టీలోనే అసమ్మతి రాగాలు మరింతగా రాజకీయ సెగలను రాజేస్తున్నాయి. అధికార వైసిపిలోనే వర్గపోరు వూపందుకుంటోంది. ఇటీవల కాలంలో మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చేసిన ఘాటైన విమర్శలు జిల్లా వైసిపిలో వర్గపోరుకు ఆజ్యం పోశాయి. (మిగతా 11వ పేజీలో)

● 'దేశం' అధ్యక్ష రేసులో

## నెల్లూరు నేతలు

- 'రెడ్ల' వరుసలో సోమిరెడ్డి
- బీసీల కోటాలో బీద
- వర్గ సమీకరణే కీలకం





తెలుగుదేశం రాష్ట్ర కార్యవర్గంలో త్వరలోనే మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబునాయుడు కొనసాగుతుండడం తెలిసిందే! రాష్ట్ర విభజన తర్వాత నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పార్టీకి ప్రత్యేక కార్యవర్గాలను ఏర్పాటు చేస్తూ, ఇరు రాష్ట్ర పార్టీ కమిటీలకు వేర్వేరుగా అధ్యక్షులను నియమిస్తున్నారు.

2014 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీకి కిమిడి కళావెంకట్రావ్ అధ్యక్షుడుగా కొనసాగుతూ వచ్చారు. అప్పుడున్న పరిస్థితుల్లో కాపు ఓటుబ్యాంకును లక్ష్యంగా పెట్టుకున్న తరుణంలో ఆ సామాజికవర్గానికి చెందిన కళా వెంకట్రావ్‌ను అధ్యక్షుడిని చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో భారీ రాజకీయ మార్పులు చోటు చేసుకున్నాయి. 2019 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎన్నడూ చూడనటువంటి ఘోరపరాజయాన్ని చవిచూసింది. రెడ్డి సామాజికవర్గం పూర్తి వ్యతిరేకం కాగా, తెలుగుదేశంపార్టీకి పునాదిగా నిలిచిన బీసీలు కూడా నిన్నటి ఎన్నికల్లో ఆ పార్టీకి దూరమయ్యారు. ఇది టిడిపికి గట్టి షాక్! గత ఎన్నికల్లో తగిలిన దెబ్బలకు మందు రాసుకుంటూ కుప్పకూలిన (మిగతా 11వ పేజీలో)

# జాగ్రత్తగా వ్యాపారాలు చేసుకోండి

**— మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్**



రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈనెల 10వ తేదీన స్టోన్‌హౌస్‌పేట, చిన్నబజారు ప్రాంతాలలో పర్యటించాడు. ఈ రెండు ప్రాంతాలలో కరోనా వైరస్ పాజిటివ్ వచ్చినందున 28 రోజులుగా వ్యాపార సంస్థలను మూసివేసి, ప్రభుత్వానికి సహకరించినందుకు గాను మంత్రి వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపాడు. గురువారం నుండి వ్యాపార సంస్థలను తిరిగి ప్రారంభిస్తున్న దృష్ట్యా జాగ్రత్తగా వ్యాపారాలు చేసుకోవాలంటూ మంత్రి వారికి సూచించాడు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి నాయకులు ముక్కాల ద్వారకానాథ్, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కిన్నెర ప్రసాద్, శ్రీరామ్ సురేష్, మంచికంటి శ్రీనివాసులు, వేలూరు మహేష్, కొణిదల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### శివానిస్ టైలర్స్ ఆధ్వర్యంలో..

## జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి ఈ నెల 10వ తేదీన నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని 'శివానీస్' టైలర్స్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. టైలర్స్ సంక్షేమం కొరకు ప్రతి టైలర్‌కు 10వేల రూపాయల నగదు కానుకను అందించిన నేపథ్యంలో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ 'శివానీస్' టైలర్స్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న టైలర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి శీనయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన సంవత్సర కాలంలోనే అన్ని వర్గాలవారికి ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ మాటలు చెప్పే ముఖ్యమంత్రిగా కాకుండా చేతల ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, మౌలాలి, హరి, సుబ్బారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

## హెడ్మాస్టర్లకు తలనొప్పిగా మారిన 'నాడు-నేడు'

'నాడు-నేడు' కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో నాయకులు ఈనెల 5న జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ఛైర్మెన్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ 'నాడు-నేడు' కార్యక్రమంలో హెడ్మాస్టర్ల పాలిట ఒక ఉత్పాతంలా తయారైందని, ఒకవైపు పేరెంట్స్ కమిటీ సమావేశాలు, వాటి తీర్మానాలు, నిర్మాణ పనులు, వస్తువులు కొనుగోలు వగైరాలతో పాటు మరోవైపు సప్లయిర్స్ కోసం, వర్కర్స్ కోసం పడిగాపులు పడాల్సివస్తోందని, వీటన్నిటి వత్తిడిల వల్ల మానసికంగా ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు.

# ప్రజల అవసరాలకు తగినంత ఇసుక

**- కలెక్టర్ యంవి శేషగిరిబాబు**

నెల్లూరు జిల్లాలో ప్రజల అవసరాలకు తగినంత ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు.

ఈనెల 9న నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డుల్లో ఇసుక లభ్యతకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ఇసుక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంగం రిజర్వాయర్, వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజ్‌లో పూడికతీత కింద సాధారణ ఇసుక తీసేందుకు గల అవకాశాలపై చర్చించారు. కమిటీ సభ్యులు స్వర్ణముఖి బ్యారేజీలో ఒక మీటరు లోతులో 2.10లక్షల క్యూబిక్ మీటర్ల సాధారణ ఇసుక, సంగం బ్యారేజీలో 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీసేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పూడికతీత ద్వారా ఇసుకను తొలగిస్తే భూగర్భ జల వనరులు తగ్గే అవకాశంపై భూగర్భ జలశాఖ అధికారులతో సమీక్షించారు. సంగం, స్వర్ణముఖి బ్యారేజీల్లో మట్టి, ఇసుక పూడికతీత ద్వారా రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బంది లేకుండా కోట మండలం కొండగుట్ట, నెల్లూరు నగర సమీపంలోని వెంకటాచలం గ్రామంలో సాధారణ ఇసుకను నిల్వ చేయాలని సూచించారు. ఇప్పటివరకు వెంకటాచలంలో 30 వేల టన్నులు, కొండగుట్టలో 1.5లక్షల టన్నుల ఇసుక నిల్వ చేసినట్లు అధికారులు వివరించారు. జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, డీపీవో ధనలక్ష్మి, మైనింగ్ డీడీ నరశింహారెడ్డి, ఏడీ రామ్మోహన్‌రావు, ఇరిగేషన్ ఈఈ సురేష్, భూగర్భ జలవనరుల శాఖ డీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

## మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రవీంద్ర

మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రవీంద్ర ఈనెల 10న బాధ్యతలు చేపట్టారు. జలదంకి ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తూ మెప్మా పీడీగా ఆయన బదిలీ అయ్యారు. సీతారామపురం, కొండాపురం, వింజమూరు, ఇందుకూరుపేట ఎంపీడీఓగా గతంలో ఆయన పనిచేశారు.

### జిల్లా పంచాయితీ

## కార్యాలయ అధికారిగా సుధ


నెల్లూరు జిల్లా పంచాయితీ అధికారి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)గా సుధ ఈనెల 10న బాధ్యతలు చేపట్టారు. గుంటూరులోని డీపీఓ కార్యాలయంలో పనిచేస్తూ డిప్యుటేషన్‌పై నెల్లూరు బదిలీ అయ్యారు. 2011 నుంచి 2017 జూన్ వరకు నెల్లూరులో ఆమె పనిచేశారు.

## పేదలకు అన్నం ప్యాకెట్లు

కరోనా, లాక్‌డౌన్ల నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేదలకు కావలిలోని సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5న అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కావలిలోని తుఫాన్ నగర్, ఇందిరానగర్‌లలోని పేదలకు ఈ సాయం అందజేశారు.

# ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



ఓజిలి మండల పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 9న ఆయన ఓజిలి మండలంలోని 5, 7, 9, 12ఆర్, 13ఎల్, 14ఆర్ తెలుగుగంగ కాలువలకు బాలాయపల్లి మండలం, ఊట్లపల్లి వద్ద గంగకాలువ మెయిన్‌గేట్లను ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 3వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతోందని, ప్రస్తుతం 5వ బ్రాంచ్‌కాలువ ద్వారా 200 క్యూసెక్కుల సాగునీరు సరఫరా అవుతున్నా అవి దిగువ ప్రాంతాలకు వెళ్ళడం లేదన్నారు. ఈ సాగునీరు సరిపోవడం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దీంతో స్పందించిన ఎమ్మెల్యే గంగ అధికారులతో కలసి కాలువలను పరిశీలించారు. 5వ బ్రాంచ్‌కి మరో 200 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేయాలని గంగ అధికారులను ఆదేశించారు. తెలుగుగంగ డిఇలు రాజ్‌కుమార్, దయాకర్‌లు మాట్లాడుతూ ఉన్నతాధికారులతో చర్చించి సాగునీటి విడుదలను పెంచుతామని ఎమ్మెల్యేకి తెలియజేశారు. కండలేరు జలాశయం నుంచి 2టిఎంసిల నీటిని విడుదల చేస్తే రైతుల సాగునీటి కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని ఎమ్మెల్యే కిలివేటి వివరించారు. అనంతరం ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఇలు సురేష్‌కుమార్, సౌమ్య, లీలాకుమారి, వైయస్సార్సీపి మండల కన్వీనర్ జి.రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏకాంతంగా.. వెంగమాంబ బ్రహ్మోత్సవాలు

దుత్తలూరు మండలంలోని నర్రవాడలో కొలువైవున్న శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈనెల 7 నుంచి నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. కరోనా, లాక్‌డౌన్ల నేపథ్యంలో అమ్మవారికి ఈసారి ఏకాంతంగానే బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. తొలుత, ఆలయంలో కొలువైవున్న వెంగమాంబ దంపతులను ఆలయ అర్చకులు శోభాయమానంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 'నిలుపు' కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. 5 రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, కరోనా వైరస్ నేపథ్యంలో భక్తులెవరికీ ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు అనుమతి లేదని నిర్వాహకులు తెలిపారు.

# పెంచలస్వామిని దర్శించుకున్న ఆనం



నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరశింహస్వామిని, ఆదిలక్ష్మీ దేవిని, ఆంజనేయస్వామిని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఈనెల 10న దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. దేవస్థాన అధికారులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. వేద పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అధికారులు స్వామి క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆనంకు అందజేశారు. ఏపీ వెంకటసుబ్బయ్య, ఆలయ మాజీఛైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి. నితీష్‌రెడ్డి, నెల్లూరు శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరోనా నివారణకు మెట్టుకూరు ధనుంజయరెడ్డి 50లక్షల విరాళం



కరోనా మహమ్మారిని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వేగవంతంగా తీసుకుంటున్న చర్యలకు తనవంతు సాయంగా 50లక్షల రూపాయల విరాళాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి అందజేస్తున్న ఎన్‌డిసిసిబి మాజీచైర్మెన్, ఆత్మకూరు నియోజకవర్గ వైసిపి నాయకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి. ఈనెల 11న తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసి ఆయన ఈ విరాళం చెక్కును అందజేశారు.

### నెల్లూరు నగరం

# టిడిపి ఇన్‌ఛార్జ్‌గా శీనయ్య



నెల్లూరు నగరం అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆ స్థానంలో ఓడిపోయిన పి.నారాయణ ఇన్‌ఛార్జ్‌గా వుంటున్నాడు. అయితే ఆయన తన వ్యాపార కార్యకలాపాల బిజీలో పార్టీ కార్యక్రమాలపై పెద్దగా దృష్టి పెట్ట లేకపోతున్న నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ బాధ్యతలను కోటంరెడ్డి శీనయ్యకు అప్ప గించారు. 2014 నుండి 2019 వరకు మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి టిడిపి నగర ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించాడు. అయితే ఈసారి ఆయనను పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకునే నేపథ్యంలో కోటంరెడ్డి శీనయ్యకు నగర పార్టీ బాధ్యతను అప్పగించారు. గత ఆరేళ్లుగా కూడా నగర పరిధిలో పార్టీ కార్యక్రమాలు ముందుండి నిర్వహిస్తున్నది శీనయ్యే. నోరున్న నాయకుడు. తిట్టగలడు, తిట్టించుకోగలడు. ఆందోళనలు, ధర్నాలు వంటివాటికి ముందుం టాడు. ఈ సమయంలో ఇన్‌ఛార్జ్‌గా ఆయనే కరెక్ట్.

### మా బంధువుల ఇళ్లకు వెళ్లాలంటే...

# మీ వద్ద పాస్‌లు తీసుకోవాలా?

**- ఆనం వెంకటరమణారెడ్డి**

మా బంధువుల ఇళ్లకు వేం పోవాలంటే మీ వద్ద ఈ-పాస్‌లే మన్నా తీసుకోవాలా? అంటూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ మీద, పి.రూప్‌కుమార్‌యాదవ్ మీద తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. ఇటీవల కాలంలో ఆనం వెంకటరమణారెడ్డి ఇరిగేషన్ పనుల్లో అక్రమాలు జరుగు తున్నాయంటూ మంత్రిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాడు. కాగా, ఈమధ్య ఆనం వెంకటరమణా రెడ్డి సంతపేటలోని తన చిన్నాన్న, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి ఇంటికి వెళ్లడాన్ని



కొందరు సెల్‌ఫోన్‌లలో చిత్రించి సోషల్ మీడియాలో పెట్టారు. ఆ వీడి యోలో ఆనం వెంకటరమణారెడ్డితో పాటు టీడీపీ నాయకుడు కిలారి వెంకటస్వామినాయుడు కూడా వున్నాడు. ఈ వీడియోపై స్పందించిన ఆనం వెంకటరమణారెడ్డి 9వ తేదీ నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి తన చిన్నాన్న స్వర్గీయ ఆనం వివేకానంద రెడ్డిని తలపించే రీతిలో వ్యంగ్యంగా మాట్లాడాడు. అవును... ఆనం రామ నారాయణరెడ్డి మా చిన్నాన్న.. హైదరాబాద్ నుండి వచ్చాను కాబట్టి కలవడానికి వెళ్లా... ఇందులో తప్పే ముంది... దీనిని కెమెరాలు పెట్టి తీయాలా... మా బంధువుల ఇళ్లకు పోవాలంటే నీ వద్దేమన్నా ఇ-పాస్ తీసుకోవాలంట్రా... నిన్న మనవడు పుట్టా డంటే ఎన్‌డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఇంటికి కూడా వెళ్లా... మొన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంటికి కూడా వెళ్లి, వాళ్ల నాయన రమణారెడ్డిని చూసొచ్చాం... ఆయనా, మా నాయనా మంచి ఫ్రెండ్స్... అంతెందుకు వైయస్ జగన్మోహన్‌రెడ్డి సోదరుడికి కూడా మా ఇంట్లో అమ్మా యిని ఇచ్చి వున్నాం... అక్కడకు కూడా వెళతాను... రాజకీయాలు వేరు... బంధుత్వాలు వేరు... నెల్లూరు సం స్కృతి, సంప్రదాయాలు రాజకీయా లకు అతీతంగా బంధువులను కలుసు కోవడం. నేను సిగరెట్టు తాగడం, మద్యం తాగడంతో మీకు పనేంట్రా... మీ అబ్బ సొమ్ముతో ఏమన్నా తాగుతు న్నానా... మా ఇంట్లో వాళ్లకు లేని ఇబ్బంది మీకేంట్రా... అది కూడా ఎప్పుడన్నా ఒక పెగ్గు తాగుదామను కుంటే మంచి బ్రాండ్లే లేకుండా చేశారు కదరా... అంటూ వాపోయాడు.

నేను అడిగిందేంటి... మీరు చెబు తున్నదేంటి... నేను ఇరిగేషన్‌లో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తున్నా? ఆల్తూరుపాడు, సోమశిల హైలెవల్ కెనాల్, సర్వేపల్లి కాలువ ఆధునీ కరణ... అన్నింటికీ రివర్స్ టెండర్లు పిలిచారు. ఒక్క కాంట్రాక్టర్‌తోనన్నా అగ్రిమెంట్ జరిగిందా? ఒక్క పనన్నా మొదలైందా? అదేమంటే మీరడు గుతున్న కమిషన్ల రేటు తట్టుకోలేక కాంట్రాక్టర్లు ఆ పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. ఇది వది లేసి నేను మందుతాగుతాను, సిగరెట్లు తాగుతానంటూ అడ్డగోలు మాటలు చెప్ప డమేంటంటూ ఆయన ధ్వజమెత్తాడు.

# సకాలంలో లబ్దిదారులకు కార్డులు

**- అధికారులకు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలు**



రేషన్, ఆరోగ్యశ్రీ, పింఛన్ కార్డులను గ్రామ, వార్డు సచివాలయాలు సకాలంలో అందజేయాలని జేసీ ప్రభాకర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డుకు సంబంధించి ఒకటోరోజు డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తులు స్వీకరించాలని, రెండోరోజు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, 3,4 రోజుల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసిన దరఖాస్తులపై దర్యాప్తు చేయాలని సూచించారు. 5వరోజు సామాజిక తనిఖీ చేయాలని వివరించారు. 6,7 రోజుల్లో సామాజిక తని ఖీల్లో లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించాలని, 8వ రోజు తహశీల్దార్ సంతకం చేసి డిజిటల్ ప్రింటింగ్‌కు పంపాలని తెలిపారు. 9, 10 రోజుల్లో బియ్యం కార్డును ముద్రించి లబ్దిదారుని ఇంటివద్దకే చేర్చాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డుకు సంబంధించి తొలిరోజు ఆర్టీజీఎస్ సేవల ద్వారా సిస్టం వ్యాలిడేషన్ పొందిన దరఖాస్తులను స్వీకరించాలని, రెండో రోజు నుంచి 6వరోజుకు జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్తతో పరిశీలన, 7వరోజు యుహెచ్ ఐడిని జనరేట్ చేయడం, హెల్త్‌కార్డును ఆమోదించడం చేయాలన్నారు. 8వ రోజు పిడిఎఫ్‌ను జనరేట్ చేసి ప్రింటింగ్‌కు పంపాలన్నారు. 9వరోజు నుంచి 19వరోజు వరకు కార్డులను ముద్రించి సంబంధిత సచివాలయాలకు పంపాలని, 20వరోజు ఆరోగ్యశ్రీ కార్డును వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే వెళ్ళి అందజేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా పింఛన్‌కార్డుకు సంబంధించి మొదటిరోజు వలంటీర్లు దరఖాస్తులు స్వీక రించాలని, 2,3 రోజుల్లో నిర్ధారించుకుని జివిఎస్‌డబ్ల్యుఎస్ పోర్టల్‌లో పత్రాలను అప్‌లోడ్ చేయాలని వివరించారు. 4, 5 రోజుల్లో ఎంపిడిఓ, మునిసిపల్ కమిషనర్లు దరఖాస్తు లను పరిశీలించాలని, 6, 7రోజుల్లో అంగీకరించిన లేదా తిరస్కరించిన దరఖాస్తులను సామాజిక తనిఖీ కోసం నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. 8,9 రోజుల్లో అభ్యంత రాలను ఎంపిడిఓలు, కమిషనర్లు పరిష్కరించాలని తెలి పారు. 10వ రోజున పెన్షన్ పాస్‌బుక్, కార్డు, హెచ్‌సిఎం లేఖ లబ్దిదారులకు వలంటీర్లు అందజేయాలన్నారు.

# మారిన వాతావరణం

నైరుతి రుతుపవనాల పుణ్యాన జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గురువారం తెల్లరుజాము నుండి చినుకులు మొదలయ్యాయి. చల్లటి గాలులు కూడా వీస్తుండడంతో ప్రజలకు వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంది. నీటి కష్టాలు అధికమవుతున్న తరుణంలో ఈ చిరు జల్లులు ఎంతో ఉపశమనాన్నిస్తున్నాయి.

## 'ప్రభా'తం

కరోనాతో సమరంలో ప్రపంచం ఓడిపోయిందా? కరోనాపై ఎత్తిన కత్తిని అన్ని దేశాలు ఒక్కొక్కటిగా దించేస్తున్నాయా? కరోనాను కంటిచూపుతో చంపేస్తాం, ఆ వైరస్‌ను నల్లిని నలిపినట్లు నలిపేస్తాం, కత్తికో కండగా నరికేస్తాం అని బీరాలు పలికిన దేశాలన్నీ ఇప్పుడు ఆ వైరస్‌తో సహజీవనానికి సిద్ధమవుతున్నాయా? గిర్రున రోజులు తిరుగుతున్నా, క్యాలెండర్‌లో నెలల షీట్‌లు సర్రున చిరిగిపోతున్నా ప్రపంచవ్యాప్తంగా కూడా తగ్గని కరోనా కేసులు ఈ ప్రశ్నలన్నింటికి అవుననే సమాధానం చెబుతున్నాయి. ప్రపంచానికి చైనా కానుకగా ఇచ్చిన కరోనా వైరస్‌తో ప్రపంచ దేశాలన్నీ సర్దుకుపోయి కలిసి కాపురం చేయడానికి సిద్ధమవుతున్నాయి.

కరోనా వైరస్ సృష్టించబడ్డ చైనాలో తప్పితే ప్రపంచంలోని ఇంకే దేశంలోనూ ఆ వైరస్ కంట్రోల్‌లో లేదు. చైనా వదిలిన కరోనా వైరస్ దెబ్బకు ప్రపంచ దేశాలన్నీ కూడా అన్నీ మూతేసుకుని మూలకూర్చుని మూడు నెలలు దాటిపోతోంది. చిన్న దేశాలే కాదు, అగ్రరాజ్యాల ఆర్థిక వ్యవస్థలు కూడా కరోనా దెబ్బకు కుదేలయ్యాయి. కొన్ని దేశాలైతే ఎప్పటికి కోలుకుంటాయో కూడా చెప్పలేని పరిస్థితి. అమెరికా అగ్రరాజ్యంగా అవతరించాక ఇంతటి ఎదురుదెబ్బ ఎప్పుడూ తినలేదు. బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, భారత్, బ్రెజిల్, రష్యా వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా దారుణంగా దెబ్బతిన్నాయి. మూడు నెలలుగా ప్రపంచమంతా మడికట్టుకుని కూర్చున్నట్లు వుండిపోయింది. మూడునెలలుగా లాక్‌డౌన్‌తో ప్రతిష్టంభన, దేశాల మధ్యే కాదు, రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య, తాలూకాల మధ్య, ఆఖరుకు ఇంటికి ఇంటికి మధ్య కూడా సంబంధాలు తెంపుకున్నా కరోనా కేసులు శూన్యం కావడం అటుంచి, లక్షలకు లక్షల లెక్కన పెరుగుతూనే వున్నాయి. ప్రపంచ దేశాలన్నీ కూడా తమ ఇతర పనులన్నీ మానుకుని, అన్ని కార్యకలాపాలను స్థంభింప చేసుకుని కరోనా వైరస్‌పై సమరం ఒక్కటే పనిగా పెట్టుకుని ఇంతకాలం పోరాడాయి.

ఇప్పుడు ఏతావాతా అందరూ తెలుసుకున్నదేమిటంటే కరోనా వైరస్ కేసులను జీరో చేయడం కష్టమని. ప్రపంచంలో పుట్టిన ఏ వైరస్ కూడా ఇంతవరకు పూర్తిగా అంతం కాలేదు. కాకపోతే వాటికి వ్యాక్సిన్‌లు, మందులు వచ్చాక నియంత్రణలో వుంటున్నాయి. ఇప్పుడు ప్రపంచ దేశాలు చేయాల్సిన పని కూడా వీలైనంత తొందరగా కరోనాకు విరుగుడుగా వ్యాక్సిన్‌లు, ఔషధాలు కనిపెట్టడమే!

మూడు నెలలు లాక్‌డౌన్ ఆయుధంతో ప్రపంచ దేశాలు కరోనా వైరస్‌తో యుద్ధం చేశాయి. అది అదుపులోకి రాలేదు. ఇప్పుడు వైరస్‌తో కలిసి నడుస్తూనే దానిని నియంత్రణలోకి తెచ్చుకునే మార్గాలను అన్వేషించాలి. ప్రపంచ దేశాలన్నీ కూడా ఒక్కొక్కటిగా ఇప్పుడిప్పుడే లాక్‌డౌన్ నుండి బయటపడుతున్నాయి. ప్రతిరోజూ కరోనా కేసులను లెక్కేసుకుంటుంటే అవి లక్షలు దాటి కోట్లల్లోకి కూడా వెళతాయి, లెక్కపెట్టుకుంటూ పోతే ప్రతిరోజూ కేసులే! ఇదే ఒక దినచర్యగా మారుతోంది. ప్రపంచ దేశాలన్నీ కూడా ఇక కరోనా గణాంకాలను నిలిపేయడం ఉత్తమం. ప్రతి దేశం కూడా కరోనా నియంత్రణకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసుకోవాలి. ఒకప్పటి క్షయ ఆసుపత్రులు మాదిరిగా ఇప్పుడు ప్రతి ప్రాంతంలోనూ కరోనా ఆసుపత్రులను ఏర్పాటు చెయ్యాలి. ప్రతిరోజూ కేసుల లెక్కలు తేలబల్లేదు, వైరస్ వచ్చిన వారిని ఆ ఆసుపత్రులలో చేరుస్తుంటే చాలు. కేవలం కరోనా వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం చేయడం కరెక్ట్ కాదు. ప్రభుత్వాలే ఆ భారాన్నంతా మోయాలన్నా కష్టమే! ప్రైవేట్ ఆసుపత్రులలో కూడా కరోనా సేవలందించేలా ప్రభుత్వాలు మార్గదర్శకాలు నిర్దేశించాలి. కరోనాతో ఇంకొంత కాలం మనకు సహజీవనం తప్పదనుకున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ మాదిరిగానే కరోనా రూల్స్ కూడా తీసుకురావాలి. భౌతిక దూరం, మాస్క్, శానిటైజేషన్ వంటి నిబంధనలు ప్రతి వ్యక్తి జీవితంలో ఒక భాగంగా మారిపోవాలి.

### నిరంతర యుద్ధమే!



లాక్‌డౌన్ ఎత్తేసి నిబంధనలు సడలిస్తున్నంత మాత్రాన కరోనా యుద్ధం పూర్తిగా ముగిసినట్లు కాదు. లాక్‌డౌన్ అన్నది కరోనా వైరస్‌ను ఎదుర్కోవడానికి ప్రజలకు ఇచ్చే శిక్షణ లాంటిదే! లాక్‌డౌన్‌తోనే కేసులు జీరో కావు. కాకపోతే ఈ లాక్‌డౌన్ సమయం కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో ప్రజలకు అవగాహన పెంచేందుకు ఉపయోగపడింది. ఈ అవగాహన వుంటేనే వైరస్‌తో నిరంతరం యుద్ధం చేయగలం. వైరస్ పూర్తిగా అంతమయ్యే వరకు పోరాడగలం.

లాక్‌డౌన్ ఎత్తేసి నిబంధనలు సడలిస్తున్నంత మాత్రాన కరోనా యుద్ధం పూర్తిగా ముగిసినట్లు కాదు. లాక్‌డౌన్ అన్నది కరోనా వైరస్‌ను ఎదుర్కోవడానికి ప్రజలకు ఇచ్చే శిక్షణ లాంటిదే! లాక్‌డౌన్‌తోనే కేసులు జీరో కావు. కాకపోతే ఈ లాక్‌డౌన్ సమయం కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో ప్రజలకు అవగాహన పెంచేందుకు ఉపయోగపడింది. ఈ అవగాహన వుంటేనే వైరస్‌తో నిరంతరం యుద్ధం చేయగలం. వైరస్ పూర్తిగా అంతమయ్యే వరకు పోరాడగలం. ఒక పోలియో, ఒక టి.బి... ఈ వైరస్‌లను సుదీర్ఘ పోరాటంతోనే మనిషి జయించగలిగాడు. ఈ కరోనా వైరస్ ఇంతే... ఓ వైపు జీవన పోరాటం చేస్తూనే ఇంకోవైపు దీంతో నిరంతర యుద్ధం చేస్తేనే... ఏదో ఒకరోజు అది మన నియంత్రణలోకి వస్తుంది.

ఈ సమరంలో భాగంగా అగ్రదేశాలు కరోనా వ్యాక్సిన్ తయారీ కోసం నిరంతరం శ్రమిస్తున్నాయి. ప్రపంచానికి చైనా ఈ వైరస్ విషయంలో సహకరించి వుంటే సరైన సమాచారం అందించి వుంటే... ఈపాటికే వ్యాక్సిన్ వచ్చుండేది! అయినా కూడా వాళ్ళతో సంబంధం లేకుండా ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ వ్యాక్సిన్ రూపకల్పనలో దూసుకుపోతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా వ్యాక్సిన్‌ను ప్రపంచానికి అందించాలనే సంకల్పంతో పనిచేస్తోంది. ఆ సంకల్పం విజయవంతమైతే కరోనాపై సమరంలో గెలుపు దిశగా ముందడుగు పడినట్లే!

---

### పెంచలకోన నరసింహునికి..


## విశేష అభిషేకాలు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి ఈనెల 5న అర్చకులు ప్రత్యేకపూజలు చేసి, విశేష అభిషేకాలు నిర్వహించారు. తొలుత నరసింహ హోమాన్ని చేపట్టారు. అనంతరం స్వామివారికి శాస్త్రోక్తంగా జ్యేష్టాభిషేకం చేశారు. శ్రీ నరసింహస్వామివారిని, ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో స్నపనపీఠంపై కొలువుదీర్చారు. 81 కలశాల జలాలతో ఉత్సవ విగ్రహాలకు ఎంతో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు శశిస్వామి, వినోద్‌స్వామి, నాగరాజస్వామి, త్రినాథ్‌స్వామిల నేతృత్వంలో ఈ పూజలు జరిగాయి.

### కరోనా మహమ్మారిని పారద్రోలాలంటూ..

## ఇరగాళమ్మకు పొంగళ్ళు

కరోనా మహమ్మారి వ్యాధిని పారద్రోలాలని ప్రార్థిస్తూ, లోకకల్యాణం కోసం ఈనెల 5న బిజెపి, విహెచ్‌పిల ఆధ్వర్యంలో ఈనెల 5న నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల సరమేశ్వరి అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా పెట్టి ప్రత్యేకపూజలు చేశారు. గతనెల పౌర్ణమి నుంచి ఈనెల పౌర్ణమి వరకు చేసిన దీక్షలను ముగించి ఆలయం వెలుపల మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు మిడతల రమేష్, విహెచ్‌పి నాయకులు మెంటా రామ్మోహన్ రావు, భజరంగదళ్ నాయకులు రత్నం భవాని, పాశం నరసింహరావు, కె.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత నగదు అనర్థమే!

రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరీ శృతి మించుతున్నాయి. వృద్ధులు, వితంతవులు, వికలాంగులు వంటి నిస్సహాయులకే నేరుగా నగదు అందించే పథకాలను పరిమితం చేస్తే బాగుండేది. కాని కులాల వారీగా, మతాల వారీగా వ్యక్తులకే నేరుగా నగదు అందించే స్కీంలను ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నారు. దీనివల్ల రాష్ట్రంలో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతుంది. అభివృద్ధి ఆగిపోతుంది. ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. ఈ సంక్షేమ పథకాల నగదుతో ఒక ప్రాజెక్ట్ పూర్తి చేస్తే కొన్ని వేల ఎకరాలకు నీళ్ల పారదం, ఉపాధి అవకాశాలు పెరగడం, భూముల విలువ పెరగడం జరుగుతుంది. స్వర్గీయ వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగింది ఇదే. తన తండ్రి మార్గాన్ని ఎందుకో జగన్ విస్మరిస్తున్నాడు.

**పులికొల్లు సతీష్‌రెడ్డి, వెంకటగిరి.**

## ఈ ఘటన బాధాకరం

కేరళ రాష్ట్రం, పాలక్కాడ్ జిల్లాలో జరిగిన ఏనుగు దుర్ఘటన అత్యంత విషాదకరం. మనుషుల కంటే మృగాలు నయం అని ఇలాంటి సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గర్భంతో ఉన్న ఏనుగు నోటికి బాంబుతో కూడిన పైనాపిల్ ఇచ్చి, దాని చావుకు కారణమైన దుర్మార్గులను ఉరికే విడిచిపెట్టకూడదు. కఠిన శిక్షలు విధించాలి. ఓ పక్క ప్రకృతి సమతుల్యం దెబ్బతిని కరోనా వైరస్ మానవ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నా ఇలాంటి వెదవలకు బుద్ధి రాకపోవడం శోచనీయం. కేరళ రాష్ట్రంలో ఆవుల వధ కూడా ఎక్కువగా జరుగుతుంది. కాబట్టి జంతు సంరక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి.

**ఎల్‌వి రాజశేఖర్, నెల్లూరు.**

## ఇసుక విధానం మారాలి

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక విషయంలో తప్పటడుగులు వేస్తోంది. బంగారు గనుల్లో కంటే కూడా ఇసుక మైనింగ్‌లలో తనిఖీలు పెంచింది. గతంలో ఉన్న ఇసుక విధానాన్ని ఇంకా జటిలంగా మార్చారు. ఇసుక దొరకడం కష్టంగా మారుతోంది. నిర్మాణ రంగానికి ఇసుక ఎంత సులభంగా దొరికితే అంత మేలు. ఇసుక చూడ దానికి నదుల్లో దొరుకుతుంది. కానీ, దీంతో అనేక వ్యాపార రంగాలు ముడిపడి ఉన్నాయి. సులభతరంగా ఇసుక దొరకకపోతే ఈ వ్యాపార రంగాలు దెబ్బతింటాయి.

**చల్లా కృష్ణకిషోర్, నెల్లూరు.**

## 'దేశం' జిల్లా అధ్యక్ష రేస్‌లో
# పెళ్ళకూరు శీనయ్య?



తెలుగుదేశం పార్టీ కార్యవర్గాలలో త్వరలో భారీ మార్పులు చోటు చేసుకోబోతు న్నట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని జిల్లాల్లో కూడా పార్టీ బాధ్యతలను కొత్తవారికి అప్ప గించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో నెల్లూరుజిల్లా పార్టీ బాధ్యతలను 'రెడ్డి' సామా జిక వర్గానికి చెందిన పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డికి అప్పగించే సూచనలు కనిపిస్తున్నాయి.

జిల్లా పార్టీ అధ్యక్షులుగా గతంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రస్తుత మున్న బీద రవిచంద్రలు సుదీర్ఘకాలం పని చేశారు. ప్రస్తుత అధ్యక్షుడు బీద రవిచంద్రకు ఆ పదవిలో కొనసాగాలని లేదు. పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోకి పోవాలనే ఆలోచనతో ఆయనున్నాడు. ఈ నేపథ్యంలో రవిచంద్ర తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడెవరైతే బాగుంటుందనే విషయమై తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

మొన్న ఎన్నికలలో ఓడిపోయిన వాళ్ళలో కార్పొరేట్లు, వ్యాపారవేత్తలు వున్నారు. వాళ్ళు పార్టీ కోసం పూర్తి స్థాయిలో పని చేయలేరు. ఈ క్రమంలో వ్యాపారవేత్త అయినప్పటికీ పార్టీ కోసం పనిచేస్తాడనే పేరున్న పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి పేరు ప్రచారంలోకి వచ్చింది.

గత రెండు దఫాలుగా ఆయన కోవూరు సీటు నాశించినప్పటికీ దక్కలేదు. 2014 ఎన్నికలకు ముందు కోవూరులో పార్టీకి దిక్కు, దివాణం లేనప్పుడు పార్టీ కేడర్‌కు అండగా నిలిచింది పెళ్ళకూరే! రెండుసార్లు టిక్కెట్ ఆశించి విఫలమైనప్పటికీ నిరాశ చెందకుండా పార్టీ అభ్యర్థుల కోసమే ఆయన పని చేశాడు. 2019 ఎన్నికలలో చంద్రబాబు ఆయన పార్టీ భక్తికి మెచ్చి నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల ఇన్‌ఛార్జిగా కూడా నియమించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఆయనను నియమించడమే కరెక్ట్ అని తెలుగుదేశం అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం.



## ● అసంతృప్తితో మందుబాబులు
# మాయమవుతున్న మంచి బ్రాండ్‌లు

*గత తెలుగుదేశం ప్రభుత్వంలో మద్యానికి ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా వుండింది. రాష్ట్రంలో టీ బంకు లేని ఊరైనా కనిపించేదేమోగాని, బెల్టుషాపు లేని ఊరంటూ వుండేది కాదు. 50 గడపలున్న ఊరికి కూడా బెల్టుషాపును పెట్టించి మందుబాబులు మద్యం కోసం వెతల పడకుండా చేశాడు చంద్ర బాబునాయుడు. ఆయన హయాంలో ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ దొరికేది. ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరికేది.*

చంద్రబాబును ఓడించిన దానికి ఫలితమేంటో మందుబాబులు ఇప్పుడు చవిచూస్తున్నారు. మద్యం అలవాటులేని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి మందుబాబుల కష్టాలు ఎలా తెలుస్తాయి? సీఎం అయ్యింది మొదలుకొని మందుబాబుల పట్ల పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నాడు. వారిపట్ల కనీసం దయ, జాలి, కరుణ అన్నవి లేకుండా ప్రవర్తిస్తున్నాడు.

బెల్టుషాపులు ఎత్తేయడం, మద్యం షాపులు తగ్గించడం, ప్రభుత్వ ఆధీనంలో మద్యం దుకాణాలను టైం టు టైం నడపడం, మద్యం రేట్లను దాదాపు డబుల్ చేయడం... ఇవన్నీ మందుబాబులకు కిక్కు దించి మంట ఎక్కించే చర్యలే!

సరే ఇవన్నీ భరిస్తున్నారు, రేట్లు డబుల్ చేసినా కొంటున్నారు, అయితే వారు కోరుకున్న బ్రాండ్లన్నా దొరుకుతున్నాయా అంటే అవి కూడా వుండడం లేదు. ఫినాయిల్ సీసాలను తలపించినట్లుగా వుండే మద్యం సీసాలు ఇప్పుడు మద్యం దుకాణాలలో దర్శనమిస్తున్నాయి. ఈ సీసాల ముఖం చూస్తుంటేనే మందు బాబులకు మద్యం తాగాలన్న కోరిక చచ్చిపోతోంది. గతంలోవున్న చాలా మద్యం బ్రాండ్లు ఇప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కనిపించడం లేదు. ఉన్నవాటిలో రెండు మూడు నాణ్యమైన మంచి బ్రాండ్లున్నా అవి మద్యం దుకాణాల దాకా రావడం లేదు. వైన్‌షాపుల పేరుతో ఇండెంట్లు పెట్టి మధ్యలోనే వాటిని కేసుల లెక్కన తెలిసిన వాళ్ళకు ఇచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి జగన్ పుణ్యమా అని మందుబాబులు జీవితంలో ఎప్పుడూ పడని బాధలు పడుతున్నారు.

## ఆత్మకూరు బస్టాండ్ తరలింపు..
# ఆచరణ సాధ్యమేనా?



*నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం కోసం ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌ను నగర శివార్లలోకి తరలించాలనే డిమాండ్ ఎప్పటినుండో వుంది. దీని కోసం జాతీయ రహదారికి దగ్గరగా పదారుపల్లి, కల్లూరుపల్లి, కనుపర్తి పాడు, బుజబుజనెల్లూరు ప్రాంతాలలో స్థల అన్వేషణ జరుగుతోంది.*

అయితే ఇప్పుడు అనూహ్యంగా నెల్లూరులోని రెండో పెద్ద బస్టాండ్ అయిన ఆత్మకూరు బస్టాండ్ తరలింపు తెరమీదకొచ్చింది. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో పొట్టి శ్రీరాములు బొమ్మవద్ద వున్న ఆత్మకూరు బస్టాండ్‌కు ఎన్నో దశాబ్దాల చరిత్ర వుంది. ఆత్మకూరు వైపు వెళ్లే బస్సులు ఎక్కువగా నిలుస్తుంటాయి కాబట్టి దీనికి ఆత్మకూరు బస్టాండ్ అనే పేరొచ్చింది. అయితే ఒక్క ఆత్మకూరుకే కాకుండా, కావలి మీదుగా, బుచ్చి మీదుగా, ఇటు మైపాడురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట రోడ్డు మీదుగా వెళ్ళే బస్సులు గాని, కోవూరు, అల్లూరు వైపు వెళ్ళే బస్సులు గాని ఇక్కడ నుండే వెళ్తుంటాయి. ఆర్టీసీ బస్టాండ్‌కు దాదాపు సరిసమాన స్థాయిలో ఇక్కడ ప్రయాణీకుల రద్దీ ఉంటుంది. ఈ బస్టాండ్ వల్లే ఇక్కడ అండర్ బ్రిడ్జి, రైల్వేస్టేషన్‌ల వద్ద ట్రాఫిక్ రద్దీగా వుంటుంది.

కాగా, ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం కోసం, ఆత్మకూరు బస్టాండ్‌ను సాలుచింతల వద్దకు తరలించాలని మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ ప్రతిపాదించాడు. ఆత్మకూరు బస్టాండ్‌ను సాలుచింతల వద్దకు తరలిస్తే చాలావరకు ఆత్మకూరు, కడప, బద్వేల్, ఉదయగిరి వైపుల నుండి వచ్చే బస్సులను అక్కడికే ఆపివేసి నగరంలో ట్రాఫిక్‌ను కొంత తగ్గించవచ్చు. ఆత్మకూరు వైపు బస్సు ప్రయాణాలు చేసేవాళ్ళు ఎక్కువగా నగరంలో మైపాడురోడ్డు, నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు ప్రాంతాల్లోనే వుంటారు కాబట్టి ఇది పెద్ద సమస్య కాకపోవచ్చు.

కాకపోతే వచ్చిన ఇబ్బందల్లా నగరంలో నుండి అక్కడికి చేరుకోవడం. సాలుచింతల వద్దకు పోవాలంటే ప్రస్తుతానికి పెన్నా వంతెనే గతి. ఇది ఇప్పటికే ఇరుకుగా వుంది. తరచూ ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. బ్యారేజీ పూర్తయితే ఆ దారి కూడా ఉపయోగపడుతుంది. కాకపోతే అప్రోచ్‌రోడ్డు సరిగా పడాలి. ఇప్పుడు పెన్నా వంతెనకు పక్కనే మరో వంతెన నిర్మిస్తే వాహనాలు రావడానికి ఒకటి, పోవడానికి ఒకటి ఉపయోగపడతాయి. నగరంలోకి వాహనాల రాకపోకలు సులభమవుతాయి. అప్పుడు ఆత్మకూరు బస్టాండును ఇక్కడికి తరలించినా పెద్ద ఇబ్బంది వుండదు. అదీగాక నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో వున్న ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి కూడా ఆస్కారముంటుంది.



## రూపుమారుతున్న...
# వీఆర్‌సి క్రీడా మైదానం

*నెల్లూరులోని వీఆర్ కళాశాల క్రీడామైదానం చాలా ఏళ్ళ తర్వాత బాగుపడబోతోంది. మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఇతర నేతల చొరవతో వీఆర్‌సి క్రీడా మైదానం దాదాపు 20లక్షల రూపాయల వ్యయంతో బాగుపడుతోంది.*

వీఆర్ విద్యాసంస్థలు బాగా నడిచినంత కాలం క్రీడాకారులతో, క్రీడలతో వీఆర్ మైదానం కళకళలాడుతుండేది. వీఆర్ విద్యాసంస్థలు ప్రాభవం కోల్పోయాక రాజకీయ సభలకు, మతపరమైన కార్యక్రమాలకు, పొద్దున వాకర్స్‌కు మాత్రమే ఈ మైదానం ఉపయోగపడసాగింది. అసలు ఈ గ్రౌండ్‌లో క్రీడలు జరుగుతాయనే స్పృహే పోయి, ఇదొక మత ప్రార్థనా సభల మైదానం అనే ప్రచారంలోకి వచ్చేసింది. ఎట్టకేలకు ప్రజాప్రతినిధుల చొరవతో వీఆర్‌సి మైదానం కొంతన్నా బాగుపడబోతున్నందుకు సంతోషించాలి.

# కంటైన్మెంట్ జోన్లలో దర్శనాలు రద్దు

నెల్లూరు జిల్లాలో కంటైన్మెంట్ జోన్ల పరిధిలో వున్న దేవస్థానాలలో దర్శనాలను రద్దు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ వేణు గోపాలస్వామి దేవస్థానం, స్టోన్‌హౌస్‌పేటలోని పలు ఆలయాలు, సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంతో పాటు పలు దేవస్థానాలలో దర్శనాలకు అనుమతులు లేవన్నారు. ఎప్పటి నుంచి దర్శనాలు ప్రారంభించేది త్వరలో తెలియజేస్తామన్నారు. ఈనెల 7న ఆయన నెల్లూరు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌తో కలిసి వివిధ ఆలయాల్లో ఏర్పాట్లు పరిశీలించారు.

## నెల్లూరు కబుర్లు

# బాపిరెడ్డికి పూర్తి బాధ్యత



నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్గా టి.బాపిరెడ్డికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్గా వున్న పివివిఎస్ మూర్తిని అనంతపురం ఆర్డిగా బదిలీ చేసి నుడా వైస్‌ఛైర్మెన్‌గా వున్న బాపిరెడ్డిని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్గా నియమించడం జరిగింది. మధ్యలో స్వప్నిక్ దినకర్ అనే ఐఎఎస్ అధికారిని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్గా వేసి కూడా రద్దు చేశారు. ఇటీవల బాపిరెడ్డి కూడా అనారోగ్యానికి గురై కమిషనర్ బాధ్యతల నుండి తప్పుకోవాలని చూశారు. కాని స్థానిక అధికారపార్టీ నాయకులు మీరే కమిషనర్గా కొనసాగాలని చేసిన విజ్ఞప్తితో ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో కార్పొరేషన్‌కు ఆయననే పూర్తిస్థాయి కమిషనర్గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

### స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్గా

# ఎం.వి సుబ్బారెడ్డి



నెల్లూరు, రెడ్‌క్రాస్ ప్రాంగణంలోని మాగుంట సుబ్బరామరెడ్డి స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్గా నేతాజీ(ఎంఎన్ఆర్) పైలెట్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, రెడ్‌క్రాస్ నెల్లూరుశాఖ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డిలు ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

### జూనియర్ రెడ్‌క్రాస్

# కన్వీనర్గా సికిందర్

జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్గా కోవూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సికిందర్‌ను నియమించినట్లు ఈనెల 7న రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

### జీతాలు లేక..

# కష్టాల్లో ప్రైవేట్ టీచర్లు

లాక్‌డౌన్ కాలానికి పలు విద్యాసంస్థల్లో పని చేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకపోవడంతో ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్ల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కరోనా కష్టకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని, కుటుంబాలను పోషించుకోవడం ఎంతో కష్టతరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆయా విద్యాసంస్థలు జీతాలిచ్చి వారిని ఆదుకోవాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు తిరుమలయ్య ఈనెల7న ఒక ప్రకటనలో విద్యాసంస్థలకు విజ్ఞప్తిచేశారు.

# కలెక్టర్‌కు నోటీసులు

ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా పేపర్ల మూల్యాంకణానికి సంబంధించి మైనర్ బాలికతో గదిని శుభ్రం చేయించిన ఉదంతంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. పోలీసుల సమక్షంలోనే ఈ సంఘటన జరగడంతో జాతీయ మానవహక్కుల కమిషన్ దీనిని సీరియస్‌గా తీసుకుని, ఈ సంఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది.

# రిటైర్డ్ టీచర్ దాతృత్వం



కోవిడ్ సహాయ చర్యల నిమిత్తం నేలటూరు రమ అనే విశ్రాంత ఉపాధ్యాయురాలు 50వేల రూపాయల విరాళాన్ని అందించి తన మంచి మనసు చాటుకున్నారు. సోమవారం నెల్లూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబును కలిసి ఆమె ఈ విరాళం చెక్కును అందించడం జరిగింది.

# జీతాలు చెల్లించాలి

ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆయా సంస్థలు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రభుత్వం ఆదుకోవాలని ఈనెల 8న ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు రమేష్ మాట్లాడుతూ అడ్మిషన్ల పేరుతో యాజమాన్యాలు వేధిస్తున్నాయని, జీతాలు ఇవ్వకుండా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీఈవోకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు యాజమాన్యాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని డీఈవో హామీ ఇచ్చారు.

### 15 నుంచి గొలగమూడిలో

# భక్తులకు అనుమతి

నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో వెలసియున్న శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో ఈనెల 15, 16 తేదీల్లో ఆశ్రమ ఉద్యోగులతో పాటు గొలగమూడి, అనికేపల్లి, కంటేపల్లి, తిక్కవరప్పాడు గ్రామాలకు చెందిన భక్తులను అనుమతించి 17వ తేదీ నుంచి బయట ప్రాంతాల భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఈనెల 7న తెలిపారు. గొలగమూడికి కిలోమీటర్ దూరంలో వున్న కంటేపల్లి పంచాయితీ గంగిరెద్దుల కాలనీలో ఒక యువకుడికి కరోనా పాజిటివ్ రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# ప్రజల దాహార్తి తీరుస్తున్న పోలీసులు

## • అన్ని స్టేషన్‌ల పరిధిలో మంచినీటి చలివేంద్రాలు

పోలీసులంటే కరకుగా వ్యవహరిస్తారని, వారిది కఠినహృదయమని చాలా మంది అనుకుంటుంటారు కానీ, అనేకమంది పోలీసులు మానవతా హృదయంతో సేవాభావంతో ప్రజలకు సేవచేస్తుండడం చూస్తే వారెంత మంచి మనసున్నవారో అందరికీ అర్ధమవుతుంది. అందుకు పోలీసులు ఇటీవల ప్రజల దాహార్తి కోసం ఏర్పాటుచేసిన చల్లని మంచినీటి చలివేంద్రాలు ఒక చక్కని ఉదాహరణ. నెల్లూరు నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు ఏర్పాటుచేసిన ఈ చలివేంద్రాలు ప్రజల దప్పికను తీరుస్తూ అందరి ఆశీస్సులందుకుంటున్నాయి. మండుటెండల్లో దాహంతో ఉన్నవారికి చల్లని మంచినీరిచ్చి ఆదుకుంటున్న పోలీసు చలివేంద్రాలను అందరూ అభినందిస్తున్నారు.

లాక్‌డౌన్ నేపథ్యంలో రెండు నెలలకు పైగానే రోడ్లపై ఎండకు గాలికి నిలబడి అనునిత్యం రోడ్లపై విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఈ మండిపోయే ఎండల్లో ప్రజలు గుక్కెడు మంచి నీరు దొరక్క ఎంతగా ఇబ్బందిపడతారోనని జిల్లా పోలీసు అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్ళగా జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ వెంటనే స్పందించి అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటుచేయాలని పోలీసులను ఆదేశించడంతో, ఆయా స్టేషన్‌ల పరిధిలోని ప్రధాన కూడళ్ళలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటగా నెల్లూరు నగరంలో ఆర్టీసి బస్‌స్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. నగరపాలక సంస్థ, సేవాసంస్థల సహకారంతో పాటు పోలీసులు సొంత నిధులతో ఈ చలివేంద్రాలను నిర్వహిస్తుండడం ఎంతైనా విశేషం.. అభినందనీయం!.. ప్రజల దాహార్తి తీరుస్తున్న పోలీసు సేవలకు హ్యాట్సాఫ్!...

# డీఎఫ్‌వోగా షణ్ముఖకుమార్

నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారిగా వైవీకే షణ్ముఖకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం కడప జిల్లా సబ్ డీఎఫ్‌వోగా పని చేస్తున్నారు. నెల్లూరు జిల్లా డీఎఫ్‌వోగా వున్న వై.శ్రీనివాసులురెడ్డికి పదోన్నతి కల్పిస్తూ శ్రీశైలం టైగర్ ఫారెస్ట్ కన్జర్వేటర్‌గా బదిలీ చేశారు. ఈ క్రమంలో సూళ్ళూరుపేట వైల్డ్ లైఫ్ డీఎఫ్‌వోగా ఉన్న ఎం.హిమశైలజను తిరుపతి ఎస్వీ జూపార్కు డీఎఫ్‌వోగాను, కావలి ఏసీఎఫ్‌గా ఉన్న జి.మంగమ్మను కృష్ణా జిల్లా డీఎఫ్ వోగాను బదిలీ చేశారు.

# ఇళ్ళ వద్దకే మందులు

### - డిఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి

లాక్‌డౌన్ నేపథ్యంలో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారికి అవసరమైన మందులను టెలిమెడిసిన్ ద్వారా ఇళ్ళ వద్దనే పొందే సదుపాయాన్ని ప్రజలకు కలుగజేస్తున్నామని, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రాజ్యలక్ష్మి ఈనెల 6న ఒక ప్రకటనలో తెలియజేశారు. బిపి, షుగర్, థైరాయిడ్ తదితర సమస్యలున్నవారు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం టెలిమెడిసిన్ కార్యక్రమాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిందని ఆమె వివరించారు. అవసరమైన వారు 14410 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే, వీడియో, వాట్సాప్ కాల్ ద్వారా వైద్యులు వెంటనే ఆ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. యాప్‌లో నమోదు చేసుకున్న 24గంటలలోపు ఆరోగ్య కార్యకర్తలు ఇళ్ళవద్దకే వచ్చి మందులు అందజేస్తారని తెలిపారు. జిల్లాలో ఇప్పటిదాకా 535మంది ఇంటి వద్దనే మందులు తీసుకున్నారని పేర్కొంటూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది అందరూ తమ పరిధిలో ఉన్న ప్రాంతాల ప్రజలకు ఈ విషయం పట్ల తగు అవగాహన కలిగించాలని ఆమె కోరారు.

### వాహన రుణ వాయిదాలకు

# ఆగస్టు వరకు వెసులబాటు

నెల్లూరు నగరంలోని రవాణా కార్యాలయంలో వాహన ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులతో డీటీసీ సుబ్బారావు ఈనెల 8న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ లాక్‌డౌన్ అమలవుతున్న క్రమంలో రాష్ట్ర రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు వాహన రుణ వాయిదాలపై ఆగస్టు వరకు మారటోరియం విధించినట్లు తెలిపారు. వాహనదారుల నుంచి ఫైనాన్స్ కంపెనీలు ఆగస్టు వరకు రుణ వాయిదాలు కట్టించుకోకుండా వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. ఆర్టీవో సుశీల, రవాణా శాఖ అధికారులు, వివిధ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఇళ్ళస్థలాలకు

# లేఅవుట్లు సిద్ధం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు జూలై 8న పంపిణీ చేయనున్న ఇళ్ళ స్థలాలకు లేఅవుట్లను సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈనెల 7న కొత్తూరు అక్కచెరువుపాడులో పేదలకు అందించనున్న ఇళ్ళ స్థలాల భూములను పరిశీలించారు. లేఅవుట్లలో రహదారులతో పాటు అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ ఎస్ ఈ ఇమాముద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

### వ్యవసాయ సలహా బోర్డులో

# పూండ్ల అచ్యుత్‌రెడ్డి

జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యుడిగా విడవలూరుకు చెందిన ఏఎంసి మాజీ ఛైర్మెన్ పూండ్ల అచ్యుత్‌రెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో బోర్డు సభ్యునిగా ఎంపిక చేసినందుకు ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## అయ్యవారిచేత...
# అరటిపళ్ళు అమ్ముకునేలా చేసిందెవరు?

**ఇటీవల నెల్లూరు నగరం వేదాయపాళెంలో డబుల్ ఎం.ఏ చేసిన ఓ సరస్వతీ పుత్రుడు, నగరంలో పేరువోసిన కార్పొరేట్ విద్యాసంస్థలో ఉపాధ్యాయుడు రోడ్డు మీద బండి పెట్టుకుని అరటిపండ్లు అమ్ముకోవడం సంచలనమయ్యింది. అరటిపండ్లు అమ్మడం అనే వ్యాపారం తప్పు కాదు. కాని, డబుల్ ఎం.ఏ చేసిన విద్యావంతుడు తనకు తగిన విధి నిర్వహణలో కాకుండా అరటిపండ్లు అమ్మడమే చర్చనీయాంశమైంది.**

వెంకటసుబ్బయ్య అనే అధ్యాపకుడు నెల్లూరులో ఓ కార్పొరేట్ విద్యాసంస్థలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులకైతే బళ్లలో ఇంతమంది పిల్లలను చేర్చాలి, ఇన్ని లక్షల రూపాయల ఫీజులు కట్టించాలి అనే టార్గెట్లు వుండవు. కాని కార్పొరేట్ విద్యాసంస్థలలో అక్కడ పనిచేసే అధ్యాపక సిబ్బందికి, ఇటు ఉద్యోగులకు టార్గెట్లు ఇస్తున్నారు. ఇన్ని అడ్మిషన్‌లు ఇస్తేనే మీకు ఉద్యోగాలుంటాయి, మీ జీతాలొస్తాయంటూ నిబంధనలు పెడుతున్నారు. కొందరైతే ఉద్యోగం కోసం, బ్రతుకు బండిని నడపడం కోసం తప్పదు అన్నట్లుగా తెలిసినవాళ్ళ చుట్టూ తిరుగుతూ అడ్మిషన్‌ల కోసం అగచాట్లు పడుతున్నారు.

ముఖ్యంగా ఈ కరోనా సీజన్‌లో చాలా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వలేదు. చదువులు చెప్పడం తప్ప రెండో పని తెలియని ఉపాధ్యాయులు ఈ కరోనా రోజుల్లో ఇంట్లో పూటగడవడానికే చాలా ఇబ్బంది పడ్డారు. వెంకటసుబ్బయ్య లాంటి వారు ధైర్యం చేసన్నా అరటిపండ్లు అమ్మారు, కొందరైతే అలాంటి పనులు చేసుకోలేక, లాక్‌డౌన్‌తో జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఇసుక టెండర్లు రద్దు



- ఎమ్మెల్యే ప్రసన్న

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం ముదివర్తి పాళెం ఇసుక రీచ్‌కు పిలిచిన టెండర్లను రద్దు చేయాలని అధికారులను ఆదేశించినట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 8న ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు జరిగితే భూగర్భ జలాలు తగ్గి, భవిష్యత్తులో తాగునీటి సమస్య వస్తుందని, ఇసుకను తరలించే క్రమంలో భారీ వాహనాలు గ్రామం గుండా వెళ్తుండడంతో వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం వల్ల పిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు వస్తున్నట్లు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అంతే కాకుండా భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అవడం, రోడ్లపై ఇసుక పడి వాహనదారులు ఇబ్బందులకు గురికావడం వంటి సమస్యలు వస్తుండడంతో టెండర్లను రద్దు చేసినట్లు తెలిపారు.



ఈ నెల 9వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, పక్కన జేసీ వినోద్‌కుమార్ తదితరులు

## తెరుచుకున్న తలుపులు....
# మోగిన గుడిగంటలు

కరోనా మహమ్మారి వల్ల లాక్‌డౌన్ విధించడంతో దాదాపు 80 రోజుల తర్వాత నెల్లూరు జిల్లాలోని అన్ని దేవస్థానాలలో భక్తులకు దైవ దర్శనాలను కల్పించేందుకు అవసరమైన తుదిదశ కార్యక్రమాలను దేవాదాయ శాఖ నిర్వహిస్తున్నది. ఈ మేరకు ఈనెల 8న ట్రయల్ రన్ నిర్వహించారు. రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, పెంచలకోన పెనుశిల లక్ష్మీ నరశింహస్వామి దేవస్థానం, జొన్నవాడ కామాక్షమ్మ దేవస్థానాల్లో ప్రధానార్చకులు ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం తలుపులు తెరిచారు. ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది మాస్కులు ధరించి, ధర్మల్ స్కానింగ్ తదుపరి భౌతిక దూరం పాటిస్తూ స్వామి వారిని దర్శించారు. నెల్లూరు రూరల్ మండలంలోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరశింహస్వామి దేవస్థానంలోను స్వామివార్లను అర్చకులు ఆలయ సిబ్బంది దర్శనం చేసుకున్నారు.





అదేవిధంగా జిల్లాలోని మసీదులు, దర్గాలు వక్ఫ్ బోర్డు ఆదేశాల మేరకు ఈనెల 8న తెరిచారు. జిల్లా వక్ఫ్ అధికారులు బారాషహీద్ దర్గా, ఇతర దర్గాలకు వెళ్ళి పాటించాల్సిన నిబంధనలు వివరించారు.

## అక్రమాలు... దౌర్జన్యాలు తప్ప...
# ఏడాది పాలనలో ఏముంది?

**- బీద రవిచంద్ర**

అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, కక్షపూరిత చర్యలు తప్పితే వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏడాది పాలనలో చెప్పుకోవడానికి ఇంకేమీ లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర విమర్శించాడు.

9వ తేదీ ఆయన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం పెట్టి వైసిపి ప్రభుత్వ ఏడాది పాలనను తూర్పారబట్టాడు. జగన్మోహన్‌రెడ్డి ఒక్క అవకాశమివ్వండని ప్రజలను అడుక్కున్నందుకు, ఆయన దీనంగా పెట్టిన ఫేస్‌ను చూసి ప్రజలు ఓట్లేసినందుకు ఈ రాష్ట్రాన్ని నట్టేట్లో ముంచాడని విమర్శించాడు. ఈ ఏడాదిలోనే వైసిపి నేతల్లో దోచుకోవాలన్న ఆత్రం తప్పితే ప్రజలకు మంచిని చేద్దామనే చిత్తశుద్ధే కనిపించలేదు. జగన్ తన పాదయాత్ర పొడవునా చంద్రబాబు పాలనపై ఎన్నో ఆరోపణలు చేశాడు... ఆఖరుకు కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి పింక్ డైమండ్ కూడా చంద్రబాబు దోచుకున్నట్లు ఆరోపించాడు. ఈ ఏడాది పాలనలో చంద్రబాబుపై ఏ ఒక్క



ఆరోపణను కూడా ఋజువు చేయలేక పోయాడని రవిచంద్ర విమర్శించాడు.

ఏడాదిపాలన పూర్తయినా సొంత చిన్నాన్న వైయస్ వివేకానందరెడ్డి హత్య కేసులో పురోగతి లేదు. ప్రజా వేదిక కూల్చివేతతో మొదలైన వైసిపి పాలన అన్ని వ్యవస్థలను కుప్పకూల్చే దిశగానే సాగుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే కోర్టుల చేత మొట్టికాయలు, ప్రత్యేక హోదాకు నీళ్లు వదలడం, మద్యం మాఫియా, ఇసుక దోపిడీ, సిమెంట్ ధరలు పెరగడం, భూ దోపిడీలు, వైసిపి నేతల దౌర్జన్యాలు మాత్రమే కనిపిస్తున్నాయన్నాడు. టిడిపి నాయకులు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, అనూరాధ, బి.మనోహర్‌రెడ్డి, సుబ్బానాయుడు, జెన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరుతో స్టూడెంట్ కిట్లు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మూడు జతల దుస్తులు, ఒక సెట్ నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, బ్యాగుతో కూడిన కిట్‌ను పాఠశాలలు పునఃప్రారంభం రోజున అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 2.50 లక్షల మంది విద్యార్థుల పాద కొలతలను సేకరించాల్సివుంది.



# గూడూరు డివిజన్ వార్తలు

## తహశీల్దార్ కార్యాలయాన్ని
# తనిఖీ చేసిన జేసీ




గూడూరు తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.వినోద్ కుమార్ ఈనెల 5న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గూడూరు పరిధిలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇళ్ళ స్థలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జులై 8న పెద్దఎత్తున ఇళ్ళ స్థలాల పంపిణీ కార్యక్రమం జరుగనుందని, అప్పటిలోగా అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆయన చెప్పారు. లేఅవుట్‌లు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహశీల్దార్ బాల లీలారాణి తదితరులు ఉన్నారు.

## సమాజసేవలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు
# మల్లాబత్తిన జీవనిరెడ్డి



గూడూరుకు చెందిన దాత, సమాజసేవకురాలు మల్లాబత్తిన జీవనిరెడ్డి గతనెల 30వ తేది నాటికి ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించి ఏడాదవుతోంది. ఈ ఏడాది కాలంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో నూరుకు పైగానే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజసేవలో తరిస్తుండడం విశేషం. తనతో పాటు సంస్థ ప్రతినిధులు కూడా సమాజసేవలో ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలకు సహకారం అందించడం ఏనాటికీ మరువలేనిదని జీవనిరెడ్డి ఈ సందర్భంగా అన్నారు. సమాజంలో ఎంతోమంది పేదకుటుంబాలకు చెందిన పిల్లలు విద్యకు దూరం అవుతున్న పరిస్థితులను గమనించి వారి విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. అదేవిధంగా పేదల ఆరోగ్యభద్రతకు అవసరమైన సేవా కార్యక్రమాలు కూడా చేపట్టామని, అందుకు డాక్టర్ జనార్ధనరెడ్డి, డాక్టర్ సి.రోహిణి ఎంతగానో సహకరించారని ఆమె పేర్కొన్నారు. ప్రతినెలా మొదటి ఆదివారం ఉచితంగా మెగా వైద్యశిబిరాలు నిర్వహించి అన్ని రకాల వైద్యచికిత్సలు అందించడంతో పాటు, మందులను కూడా ఉచితంగానే అందజేస్తున్నామన్నారు. గూడూరు పరిసర గ్రామాల్లోని ఎంతో మంది పేద కుటుంబాల వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. పచ్చదనం పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ ఎన్నో రకాల మొక్కలను నాటామన్నారు.

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో పేద కుటుంబాల వారిని ఆదుకుని వారికి నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలు అందించామన్నారు. క్వారంటైన్ సెంటర్‌లో ఉన్న కరోనా అనుమానితులకు కూడా ఆహారం అందజేసి వారి ఆరోగ్యపరిరక్షణకు సహకారం అందజేశామన్నారు. అంతేకాక, రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిమ్ సోదరులకు రంజాన్ సరుకులు, ప్రతి నెలా 5వ తేది రెడ్ సంస్థ తరపున దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళామండలి సంస్థల ప్రతినిధులు, నిర్వాహకులు ఎంతో అద్వితీయంగా అందించిన సహాయ సహకారాలతో తాము ఇన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని అంటూ అందరికీ ఆమె ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయాల్లో..
# ముందుజాగ్రత్తలు తీసుకోవాలి
### - గూడూరు డిఎస్పీ శ్రీభవాని హర్ష



మాట్లాడుతున్న గూడూరు డిఎస్పీ శ్రీభవాని హర్ష, పక్కన టౌన్ సిఐ దశరధరామారావు

కరోనా వైరస్ నేపథ్యంలో గత కొంతకాలంగా మూతపడిన ఆలయాలను కొన్ని షరతులతో తిరిగి తెరవడానికి ప్రభుత్వాలు అనుమతిచ్చిన సందర్భంగా ఆలయాల్లో భక్తుల ప్రవేశం పట్ల తగు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని గూడూరు డిఎస్పీ శ్రీభవాని హర్ష అన్నారు.

ఈనెల 8న గూడూరు 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో గూడూరు పట్టణంలోని పలు ఆలయాలకు సంబంధించిన అధికారులు, పూజారులతో పాటు హోటళ్ళు, రెస్టారెంట్ల యజమానులతో ఆయన మాట్లాడారు. ఆలయాల్లోకి గుంపులు గుంపులుగా ఎవరినీ అనుమతించకూడదని, అందరూ తప్పకుండా మాస్క్‌లు ధరించాలని, ప్రతిరోజు ఆలయాలను శానిటైజ్ చేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కరోనా వైరస్ కేసులు నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా అందరూ తగు జాగ్రత్తలతో ఉండాలన్నారు. స్వీయనియంత్రణ, సామాజిక దూరం పాటించాలని, భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను ఇవ్వకుండా, కేవలం స్వామి దర్శనభాగ్యం మాత్రమే కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ దశరథరామారావు, ఎస్ఐలు సైదా, బ్రహ్మనాయుడు, ఉదయలక్ష్మి, పలు హోటళ్ళు, రెస్టారెంట్ల యజమానులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# చికెన్ బిర్యాని పంపిణీ



గూడూరు నలజాలమ్మ వీధిలోని 7వ సచివాలయంలో 14, 11 వార్డులకు సంబంధించిన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు చికెన్ బిర్యాని భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. దివంగత కోడిపర్తి కృష్ణయ్య (కెకె రావు) కుమారుడు కోడిపర్తి శ్రీధర్, కోడలు 14వ వార్డు కౌన్సిలర్ కల్పన సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, సిఐ దశరథరామారావు, మాజీ కౌన్సిలర్ బాలిబోయిన రమేష్, కొండూరు కోదండరామయ్య, గోపాల్‌యాదవ్, 14వ వార్డు కార్యకర్తలు నెల్లూరు ప్రభాకర్, చిల్లర జ్యోతిప్రకాష్, మండిగ సాయిరోహిత్, పురోహిత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ టీచర్‌కు
# ఏపిటిఎఫ్ సన్మానం



గూడూరు, చిల్లకూరు మండలాల్లో సుదీర్ఘకాలం తెలుగు పండితునిగా ఉంటూ ప్రస్తుతం జడ్పీ బాలికల హైస్కూల్లో పనిచేస్తూ మే 31న రిటైరైన పట్నం శ్రీనివాసులును ఈనెల 7న ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏపిటిఎఫ్ నాయకులు జి.శివకుమార్, ఎం.జైపాల్‌రెడ్డి, ఎం.రమణయ్య, షేక్ షఫీ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ కలిగిన విద్యాబోధన చేయడంతో పాటు, ఏపిటిఎఫ్ అభ్యున్నతికి కూడా శ్రీనివాసులు ఎంతగానో పాటుపడ్డారని, ఉద్యోగ విరమణ అనంతరం ఆయన సుఖసంతోషాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

## ప్రకృతిని సంరక్షించుకోవడం
# అందరి బాధ్యత




ఈనెల 6న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు సమీపంలోని చెన్నూరు గ్రామంలో ఉన్న 2వ ఎస్‌సి కాలనీలో గో గ్రీన్ వ్యవస్థాపకుడు ఎల్లంటి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు ఎల్లంటి సనత్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథులుగా గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, రూరల్ ఎస్ఐ పుల్లారావు, వైకాపా నాయకులు మనపాటి రవీంద్రలు మాట్లాడుతూ ప్రకృతిని సంరక్షించుకోవాలన్నారు.



ఈ నెల 9వ తేదీన గూడూరులో జరిగిన వైసిపి సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ మనుమడు మాన్విత్ ఆయాన్ మొదటి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆ బాబును దీవిస్తున్న గూడూరు ఎమ్మెల్యే వెలగపూడి వరప్రసాద్



గూడూరులోని 16, 17 డివిజన్లలో ఏర్పాటు చేయాలనుకుంటున్న చేపలు, మాంసం మార్కెట్‌ను రద్దు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఓబులేసుకు వినతిపత్రం అందజేస్తున్న వాసలి ప్రవీణ్, మనుబోలు రూపేష్‌రెడ్డి, శివసాయికుమార్, సాయి, అనిల్

## మొక్కలు నాటండి..

# పర్యావరణాన్ని కాపాడండి

**సీనియర్ సివిల్‌జడ్జి సుధ పిలుపు**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సుధ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంకటకృష్ణయ్య ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణంలో ఈనెల 5న మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. మనిషికి ప్రాణవాయువులనిచ్చేది చెట్లేనని, వాటిని కాపాడుకోవాలని, నీటిని వృధా చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పెంచలనరసయ్య, మదన్, రవి ఆనంద్‌లతో పాటు లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రకృతిని కాపాడుకుందాం..

ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇ.ఇ ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకుంటూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవడం అందరి ధ్యేయం కావాలన్నారు. అనంతరం అందరితో ఆ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.శ్రీనివాసులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థ మేనేజర్ కె.మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఆరోగ్య బీమా వర్తింపజేయాలి

**జిల్లా కలెక్టర్‌కు విజ్ఞాపన**

కరోనా నేపథ్యంలో వైద్యసిబ్బందికి కేంద్రప్రభుత్వం ప్రకటించిన 50 లక్షల ఆరోగ్య బీమాను జర్నలిస్టులకు కూడా వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం నాయకులు జిల్లా కలెక్టర్ శేషగిరిబాబుకు ఈనెల 5న వినతి పత్రం సమర్పించారు. కరోనా వైరస్ విస్తరిస్తున్న ఈ తరుణంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని, జిల్లాలో రేషన్ కార్డుల సాంకేతిక సమస్యలతో జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలను కూడా పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టు ఫోరం గౌరవాధ్యక్షుడు ఆకుల పురుషోత్తంబాబు, శాఖమూరి శ్రీనివాసులు, సుబ్బుసింగ్, నన్నూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు పదివేలివ్వాలి

కరోనా, లాక్‌డౌన్‌ల కారణంగా గత రెండు నెలలుగా భవన నిర్మాణ కార్మికులు జీవనభృతి కోల్పోయి బాధలు పడుతున్నారని, కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా వారికి ప్రతినెలా కనీసం 10వేల రూపాయలను జీవనభృతిగా ఇవ్వాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి కొండా ప్రసాద్, కిన్నెర కుమార్, రత్నం, సుబ్రహ్మణ్యం, వినోద్, అహ్మద్, మోహన్, శేషు, కుమార్ తదితరులు నెల్లూరులోని కార్మికశాఖ అధికారులకు ఈనెల 5న వినతిపత్రం సమర్పించారు. సిఐటియు నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు

# మంజూరు చేయండి

**మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన**

తమకు కనీస వేతనాలు లేకపోవడంతో తమ కుటుంబాలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నాయని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 5న వారు నాయుడుపేటలో విద్యావనరుల కేంద్రం ఎదుట ఆందోళన చేశారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లుల్ని ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరారు. కొన్ని మండలాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులను తొలగించి అధికారపార్టీకి చెందిన వారిని విధుల్లో చేర్చుకోవడం న్యాయం కాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

---

శ్రీను గల్పిక 991

# ఎస్కేప్ అయిన ఏడుకొండలవాడు

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన తిరుమల తిరుపతి క్షేత్రం... జూన్ 8వ తేదీ ఉదయం 6గంటల సమయం... దాదాపు 90 రోజుల లాక్‌డౌన్ తర్వాత భక్తుల దర్శనార్థం శ్రీవారి గర్భగుడి తలుపులు తెరుచుకోబోతున్నాయి. స్లాట్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్న భక్తులు భౌతిక దూరం పాటిస్తూ 'క్యూ'లో నుంచుని వున్నారు. ఆ దివ్యమంగళ స్వరూపుడిని చూడాలనే ఆతృత వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. వేదపండితులతో పాటు టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ, ఇ.ఓ అశోక్ సింఘాల్, మరికొంతమంది టిటిడి పాలకమండలి సభ్యులు కూడా అక్కడే శ్రీవారిని దర్శించుకోవడానికి వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు. శ్రీవారి గర్భగుడి తలుపులు తెరవబోయే ముందు వై.వి.సుబ్బారెడ్డి... 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడువాడు... కొండలంత వరములు గుప్పెడువాడు' అనే అన్నమయ్య సంకీర్తన పాడి.. నా భక్తి పాటకు స్వామి మైమరచి నిద్రలేచి వుంటాడు, ఇక తెరవండి తలుపులు అని ఆదేశించాడు. ప్రధానార్చకులు రమణదీక్షితులు గర్భగుడి తలుపులు తెరుస్తున్నాడు. భక్తులంతా కళ్లార్పకుండా శ్రీవారిని ఎప్పుడెప్పుడు చూస్తామా అన్నట్లుగా ఆ వైపే చూడసాగారు. తలుపులు తెరుచుకున్నాయి. అంతే... ఒక్కసారిగా అందరూ షాక్... అందరి నోళ్ళు అలాగే తెరచుకున్నాయి... కారణం అక్కడ వుండాల్సిన శ్రీనివాసుడు లేడు. ఏమైపోయాడు... ఏమైపోయాడు... అందరిలో ఒకటే అంతర్మథనం. పదినిముషాల కల్లా అందరూ తేరుకుని... స్వామిని వెదకడం మొదలుపెట్టారు. తిరుమలలో స్వామి మాయమయ్యాడన్న వార్త క్షణాలలో ప్రపంచమంతా పాకింది.

ఈ విషయం తెలిసిన వెంటనే హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో హైటెక్‌రత్న, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు విలేకరుల సమావేశం పెట్టాడు. వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలను చూడలేకే వెంకటేశ్వర స్వామి అక్కడనుండి వెళ్లిపోయాడు, ఈ ప్రభుత్వం దిగిపోయి, మళ్ళీ నేను సీఎం అయ్యేదాకా స్వామి తిరిగి రాడు. కాబట్టి జగన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రెస్‌మీట్ ముగించాడు.

*****

తిరుమలలో శ్రీవారు కనిపించడం లేదని తెలిసిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశాడు. కలియుగ దేవుడు కనిపించకపోవడం మనకు తీరని శాపం... ఆయన దర్శన భాగ్యం దొరకని ఈ జీవితాలు వ్యర్థం... ఆయన ఎందుకు మాయమయ్యాడు, అసలు ఎక్కడ వున్నాడో కనిపెట్టడానికి ఇప్పుడే సిబిఐ దర్యాప్తుకు ఆదేశిస్తున్నానని మోడీ చెప్పాడు. ఆయన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది.

*****

టెన్‌జనపథ్‌లో కాంగ్రెస్ యువనేత రాహుల్ ప్రెస్‌మీట్... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని పేదరికాన్ని మాయం చేయడంలో విఫలమైంది. కాని ఏడుకొండల్లో కొలువైన వేంకటేశ్వరస్వామిని మాయం చేయడంలో మాత్రం విజయవంతమైంది... చప్పట్లు కొట్టగానే కరోనా పోదు... మీరు పిలవగానే దేవుడు రాడు. వెదకండి... ఆయనను వెతికి తీసుకురండి... లేకుంటే గద్దెదిగిపోండి అంటూ డిమాండ్ చేశాడు.

*****

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి మాయం కావడానికి కారణం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డే... ఆయన పరిపాలన చూడడం ఇష్టంలేకే శ్రీవారు మాయమయ్యారు. కాబట్టి ఆయనను వెంటనే పదవి నుండి దిగిపోయేలా ఆదేశాలు ఇవ్వాలంటూ బీజేపీ నేత, మాజీమంత్రి కామినేని శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

*****

తాడేపల్లిలోని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం. మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాస్, పి.అనిల్‌కుమార్‌యాదవ్, పేర్ని నాని, మేకపాటి గౌతమ్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ తదితరులున్నారు. వేంకటేశ్వరస్వామి ఎక్కడికెళ్లుంటాడు అని జగన్ సందేహంగా అడిగాడు... దానికి అనిల్‌కుమార్ యాదవ్... బళ్లకు ఆగస్టుదాకా సెలవలన్నారు కదా... గుళ్లకు కూడా అప్పటిదాకా సెలవులనుకుని వేంకటేశ్వరస్వామి అమ్మవార్లతో ఎక్కడికన్నా సమ్మర్ ట్రిప్ వెళ్లుంటాడని అన్నాడు. వెల్లంపల్లి శ్రీనివాస్ వుండి... స్వామి ఇలా చెప్పా పెట్టకుండా మాయమైపోతే ఎలా... ప్రజలకు ఏమని సమాధానం చెప్పుకోవాలని అన్నాడు. వైయస్ జగన్ ఫోన్ తీసుకుని వైవి సుబ్బారెడ్డికి ఫోన్ చేశాడు. అవతల సుబ్బారెడ్డి ఫోన్ ఎత్తగానే... ఛైర్మెన్ గారు... స్వామి కనిపించాడా అని అడిగాడు. ఇంకా లేదు సీఎం గారు, వెదుకుతున్నామని సుబ్బారెడ్డి చెప్పాడు. ఏం చేస్తారో నాకు తెలియదు... సాయంత్రానికల్లా స్వామివారు భక్తులకు దర్శనమివ్వాలి... అని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

*****

జగన్ ఆదేశాలతో వై.వి.సుబ్బారెడ్డి కొండలు, గుట్టలు ఎక్కుతూ... "ఏడు కొండల స్వామి ఎక్కడున్నావయ్యా, ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా.." అని పాటలు పాడసాగాడు. కాని, స్వామి జాడ ఎవరికీ కానరావడం లేదు. సుబ్బారెడ్డిలో నీరసం ఆవహిస్తోంది... నిస్పృహ ముంచుకొస్తోంది. నా స్వామి ఇక కనిపించడా అని నిర్వేదంతో మాట్లాడుతుండగా పక్కనే వున్న ఆయన సతీమణి స్వర్ణమ్మ...స్వామి వారు ప్రత్యక్షం కావాలంటే కొన్ని లాజిక్‌లు వాడాలి... భక్తులు బాధల్లో వుంటే ఆ స్వామి ప్రత్యక్షమవుతాడు... అని చెప్పింది. బాధ అంటే... అని సుబ్బారెడ్డి అడిగాడు. ఈ కొండల్లో నడుస్తూ ఏదన్నా రాయి తట్టుకుని కాలు నొప్పి పుట్టి.. స్వామీ అని అరిస్తే ఆయన ఎక్కడున్నా వస్తాడు అని స్వర్ణమ్మ చెప్పింది. నాకు ఇప్పుడు ఏ కాలూ గాయమవ్వి నొప్పి లేదుకదా అని వై.వి.సుబ్బారెడ్డి అనగా... ఇప్పుడు పుట్టిద్ది చూడండి అంటూ స్వర్ణమ్మ పక్కనే వున్న ఒక రాయిని తీసుకుని వై.వి.సుబ్బారెడ్డి కాలి బొటన వేలిపై బలంగా కొట్టింది. ఆ దెబ్బకు సుబ్బారెడ్డి... స్వామీ.. అంటూ పెద్దగా బాధతో అరిచాడు. అంతే... మరుక్షణం వేంకటేశ్వరస్వామి ఆయన ముందు ప్రత్యక్షమై ఏమైంది భక్తా అని అడిగాడు. శ్రీవారిని చూడగానే సుబ్బారెడ్డి నొప్పిని మరిచిపోయాడు. వెంటనే శ్రీవారి కాళ్లపై పడి... స్వామీ, చెప్పా పెట్టకుండా ఎందుకు మాయమయ్యావు, మాకెందుకు ఈ పరీక్ష పెట్టావు అని అడిగాడు. దానికి స్వామి... నాయనా, నా దర్శనం కోసం ఈరోజు నుండి తలుపులు తీస్తున్నారు బాగానే వుంది, వచ్చే భక్తులందరూ మాస్క్‌లు ధరించి, శానిటైజర్లు పూసుకుని వస్తున్నారు... వాళ్ళ జాగ్రత్తల్లో వాళ్ళున్నారు... మరి నేను కూడా నా జాగ్రత్తలో వుండాలి కదా... గుడి తలుపులు తెరిచే ముందు నాకు కూడా ఒక మాస్క్ తగిలించి వుంటే.. ఆ కరోనా భయం లేకుండా అక్కడే వుండేవాడిని కదా అని చెప్పాడు. దానికి సుబ్బారెడ్డి... అంత దూరం ఆలోచించలేదు స్వామి, తప్పయిపోయింది అంటూ చెంపలేసుకున్నాడు.



స్వర్ణభారత్ ట్రస్ట్.. అంటే ఒక మానవతా వేదిక. మానవీయ సేవలకది ప్రతీక!.. అదో మహోన్నత సేవా పతాక! నిరుపేదల జీవితాల్లో వెలుగుబాటలు పరచేందుకు, తద్వారా ఆ దీనజనుల వదనాల్లో చిరునవ్వులు పూయించేందుకు అనునిత్యం కృషిచేస్తున్న నిస్వార్థ సేవా సంస్థ... స్వర్ణభారత్ ట్రస్ట్. నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం, నెల్లూరుతో పాటు విజయవాడ, హైదరాబాద్‌లలో కూడా ఉన్న ఈ స్వర్ణభారత్ ట్రస్ట్ శాఖల ఆధ్వర్యంలో నిరంతరం పేదల అభ్యున్నతికి, వారికి అన్నివిధాల సహాయ సహకారాలందించేందుకు కృషి జరుగుతూనే ఉంటుంది. అందులోనూ ఈ కరోనా కష్టకాలంలో వేలాదిమంది నిరుపేదల ఆకలి తీరుస్తూ స్వర్ణభారత్ ట్రస్ట్ నిరుపమానమైన సేవలందిస్తోంది. ఇటీవల నెల్లూరులోని సేవాజ్యోతి కాలనీలోని కుష్టువ్యాధిగ్రస్తుల పట్ల కూడా ఆ ట్రస్ట్ చేసిన నిస్వార్థ సేవలు స్వర్ణభారత్ ట్రస్టీ దీపమ్మ సేవాభిలాషకి, స్వర్ణభారత్ ట్రస్ట్ సేవానిరతికి నిదర్శనం.








# సేవా భరితం..'స్వర్ణ భారత'ం

ఎక్కడిదో ఒక ఆర్తనాదం.. 'అమ్మా!.. ఆకలి' అని. అది అందరికీ వినిపించదు. హృదయమున్న తల్లులకే వినిపిస్తుంది. మానవీయమూర్తులకే ఆ పిలుపులోని ఆవేదన అర్థమవుతుంది. ఆకలితో తల్లడిల్లుతున్న దీనజనులను ఆదుకునేందుకు వెంటనే.. ఆ తల్లే కదిలొస్తుంది. ఆమె పేరే.. దీపమ్మ. భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె. సేవకు ప్రతిరూపం ఆమె. బీదల పట్ల, దీనుల పట్ల ఆమెకున్న కరుణ, సేవాభావం అంతా ఇంతా కాదు. మానవసేవే మాధవసేవగా భావిస్తూ నిత్యం పేదల బాధలు తీర్చేందుకే ఆమె తన కున్న సమయాన్నంతా వెచ్చిస్తూంటుంది. పేదల బాధలు తీర్చడంలోనే ఆమెకు సంతృప్తి. అందుకే, 'ఓ భగవంతుడా!..నిరుపేదలకు సేవ చేయాలనే మా సంకల్పాన్ని మరింత శక్తివంతం చేసి ఈ సేవాయజ్ఞానికి మీ ఆశీస్సులు సదా ప్రసాదించండి స్వామీ!'.. అని ఆమె అనునిత్యం ఆ దేవుడిని కోరుకుంటుంది. అంతటి దయార్ద్ర హృదయురాలైన దీపమ్మ ఈ కరోనా కష్టకాలంలో కుష్టువ్యాధిగ్రస్తులు పడుతున్న బాధలపై కూడా దృష్టి సారించింది. స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ట్రస్ట్ సభ్యులు, స్వచ్ఛంధ సేవకులందరి సహకారంతో ఆ దీనులకు రెండుపూటలా కడుపు నిండా అన్నం పెట్టి ఆదుకుంటోంది. కరోనా మహమ్మారి వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో, లాక్‌డౌన్‌తో ఇళ్ళలోంచి బయటకు రాలేక, జీవనోపాధిని కోల్పోయి కష్టాలు పడుతున్న పేదలకు, రెక్కాడితే గానీ డొక్కాడని బడుగుజీవులు, పనులు కోల్పోయి ఆకలితో అల్లాడుతున్న వేలాదిమంది వలస కార్మికులకు స్వర్ణభారత్ ట్రస్ట్ తనవంతు సేవలందిస్తూ తన సేవా భావాన్ని చాటుకుంది.

## సేవాజ్యోతి కాలనీలో సేవలు

ఇటీవల నెల్లూరులోని సేవాజ్యోతి కాలనీలో ఉన్న కుష్టువ్యాధిగ్రస్తులకు, సుమారు 130 దాకా ఉన్న వారి కుటుంబాలకు రెండుపూటలా మంచి భోజనం పెట్టి వారి ఆకలి తీర్చింది స్వర్ణభారత్ ట్రస్ట్. లాక్‌డౌన్ పరిస్థితుల్లో బయటకు వెళ్ళలేక, జీవనోపాధి లేక ఆకలితో విలవిలలాడుతున్న దాదాపు 350 మందికిపైగా ఉన్న ఆ నిరుపేదలను ఆదుకునేందుకు దీపమ్మ సంకల్పించింది. 'స్వర్ణభారత్ ట్రస్ట్' ద్వారా వారికి అవసరమైన నిత్యావసర సరుకులను అందించేందుకు సమాయత్తమైంది. గత 50 రోజులుగా వారికి రెండు పూటలా అన్నం పెడుతూ, ఇతరత్రా నిత్యావసర సరుకులను కూడా అందజేస్తూ స్వర్ణభారత్ ట్రస్ట్ అందరి అభినందనలు అందుకుంటోంది.

## 'మా బంగారుతల్లి.. చల్లంగ ఉండాల..

కరోనా కష్టకాలంలో తమకు అన్నం పెట్టి ఆదుకుంటున్న 'మా బంగారుతల్లి దీపమ్మ చల్లంగ ఉండాల'.. అంటూ సేవాజ్యోతి కాలనీ వాసులు నిండుమనసుతో దీపమ్మను దీవిస్తున్నారు. కృతజ్ఞత నిండిన కళ్ళతో స్వర్ణభారత్ సేవలను కొనియాడుతున్నారు. 'మా వెంకయ్య.. ఆయన కూతురు దీపమ్మలే మా దేవుళ్ళని, ఈ కరోనా కష్టకాలంలో తాము ఆకలితో చచ్చిపోకుండా ప్రాణాలు నిలబెట్టారని'.. వారు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్తున్నారు. 'మా బంగారుతండ్రి ఉపరాష్ట్రపతి వెంకయ్య.. ఆయన కూతురు దీపమ్మ కలకాలం చల్లంగ ఉండాల'ంటూ ఆ కాలనీలోని నిరుపేద వృద్ధులు మనసారా ఆశీర్వదిస్తున్నారు.

# వీరనారి.. పొణకా కనకమ్మ



సమాజం కోసం సర్వం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి వీరనారి పొణకా కనకమ్మ అని ప్రభుత్వ న్యాయవాది కనుమూరు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 10న నెల్లూరులోని పొణకా కనకమ్మ ప్రాథమిక పాఠశాలలో కనకమ్మ 129వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కనకమ్మ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కనకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలైన పొణకా కనకమ్మకు 'భారతరత్న' ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బి.సురేంద్రరెడ్డి, ఎ.జయప్రకాష్, గూడూరు లక్ష్మి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, మురళీ కృష్ణ, ఆదిలక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.

## కాలధర్మం

# కోట మస్తాన్‌రెడ్డి



అల్లూరు వాస్తవ్యుడు కోట మస్తాన్‌రెడ్డి జూన్ 8న తన 62వ ఏట తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. గత వారంరోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతుండిన మస్తాన్‌రెడ్డి సోమవారంనాడు కన్నుమూశారు. మస్తాన్‌రెడ్డికి దైవ చింతన ఎక్కువ. అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ ఆలయ పునర్నిర్మాణ కమిటీకి ఆయన కోశాధికారిగా పనిచేశాడు. అల్లూరుపేటలోని షిరిడి సాయి సేవాసమితి సభ్యుడిగా సాయినాథునికి సేవలు చేశాడు. మస్తాన్‌రెడ్డి మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### శ్రీసిటీ పరిసరాల్లో..

# వంద పడకల ఇఎస్ఐ ఆసుపత్రి

**- కార్మిక శాఖ మంత్రి జయరాం సమీక్ష**

శ్రీసిటీ పరిసరాల్లో పరిశ్రమల కార్మికులకు అందుతున్న ఇఎస్ఐ సేవలపై రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఈనెల 9న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీని సందర్శించిన మంత్రికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు చెప్తూ, ఇక్కడి కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నదని, కనుక ఈ ప్రాంతంలో నూరు పడకల ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు వేగవంతం కాగలదని ఆకాంక్షించారు. ఈ ఆసుపత్రి ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పెద్దసంఖ్యలో కార్మికులకు వారి కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇఎస్ఐ సమీక్ష సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మంత్రితో ఫోన్లో మాట్లాడుతూ సత్యవేడు, వరదయ్యపాలెం మండల కేంద్రాల్లోని ఇఎస్ఐ క్లినిక్‌లు సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన వైద్యసిబ్బందిని నియమించాలని, ఖాళీలను భర్తీచేయాలని కోరారు. శ్రీసిటీకి చెందిన కార్మికులు



తడ, సూళ్ళూరుపేట పట్టణాల్లో అధిక సంఖ్యలో నివసిస్తున్నందున అక్కడున్న ఇఎస్ఐ డిస్పెన్సరీల స్థాయిని పెంచి మెరుగైన సేవలందించాలని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇఎస్ఐ క్లినిక్‌లలో సిబ్బంది ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని, తడ, సూళ్ళూరుపేటల్లోని డిస్పెన్సరీల స్థాయిని పెంచడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తడ సమీపంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతామని, భవిష్యత్తులో దీనిని 300 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కడప ఇఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, కర్నూలు కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాసులు, శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

# రామతీర్థం బ్రహ్మోత్సవాలు 12 నుంచి

విడవలూరు మండలంలోని రామతీర్థంలో కొలువై ఉన్న శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి 21వతేది వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కరోనా నేపథ్యంలో ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అనుమతి లేదని ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

# తిరుగుబాటు తప్పదా?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీని ఆయన సొంతంగా గెలిపించిన సందర్భం ఒక్కటి కూడా లేదు. 1995లో ఎన్టీఆర్ నుండి అధికారాన్ని లాక్కున్నాడు. 1999లో వాజ్‌పేయి సానుభూతితో, 2014లో నరేంద్ర మోడీ, పవన్‌కళ్యాణ్‌ల ఫోర్స్‌తో ఆయన గెలిచాడు. అంతే తప్పితే ఒక ఎన్టీఆర్‌లా, వైయస్ రాజశేఖరరెడ్డిలా, వైయస్ జగన్మోహన్‌రెడ్డిలా ఒంటిచేత్తో పార్టీని గెలిపించే సత్తా, సొంత ఇమేజ్ ఆయనకు లేదన్నది తేట తెల్లమైపోయింది.

చంద్రబాబు నాయకత్వ సమర్ధతపై పార్టీలో అందరి నమ్మకాలు సడలిపోతు న్నాయి. కాబట్టే ఒక్కొక్కరుగా నాయకులు తెలుగుదేశంను వీడుతున్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి జంపింగ్‌కు అవకాశమివ్వాలేగాని తెలుగుదేశం నుండి వైసిపిలో చేరడానికి ఏడుమంది ఎమ్మెల్యేలు రెడీగా వున్నారు. జగన్ పచ్చజెండా వూపితే బాబు ప్రతిపక్ష హోదా గల్లంతైపోతుంది. అలావుంది టిడిపి పరిస్థితి.

చంద్రబాబుకు వయసైపోతోంది... అదీగాక ఆయన జనాకర్షణ నేత కాదు. పార్టీని సొంతంగా అధికారంలోకి తెచ్చే కెపాసిటీ లేదు. రాజకీయ వారసుడనుకునే లోకేష్ చూస్తే, పార్టీని నడపడానికి అంత సమర్ధుడు కూడా కాదు. కాని పార్టీని ఎలాగైనా నిలబెట్టుకోవాలన్నది ఆ పార్టీలోని కేడర్ ఆసక్తే కాదు, ఆ పార్టీకి తొలినుండి వెన్నుదన్నుగా నిలిచిన కమ్మ సామాజికవర్గీయుల అభిప్రాయం కూడా! ఎలాగైనా ఎన్టీఆర్ పెట్టిన పార్టీని కాపాడుకోవాలన్నది వారి నిశ్చితాభి ప్రాయం. ఎన్టీఆర్ వల్ల పార్టీ తప్పుదారి పడుతుందనుకున్నప్పుడు చంద్రబాబు పక్కన వీళ్లంతా నిలిచారు. ఇప్పుడు చంద్రబాబు వల్ల పార్టీ దెబ్బతింటుందను కుంటే రేపు ఏ జూనియర్ ఎన్టీఆర్ పక్కనో నిలుస్తారు! ఇక్కడ ఆ వర్గానికి వ్యక్తులు ముఖ్యం కాదు... పార్టీని నిలబెట్టగల నాయకుడు ముఖ్యం. చంద్ర బాబుకు అంతటి చరిష్మా లేదు కాబట్టి వాళ్ళ చూపంతా జూనియర్ ఎన్టీఆర్ వైపే వున్నట్లుగా తెలుస్తోంది.

ఈ కోణంలో నుండి చూస్తే జూనియర్ ఎన్టీఆర్ రూపంలో పైలోకాలలో వున్న పెద్దఎన్టీఆర్, చంద్రబాబుపై ప్రతీకారం తీర్చుకుంటాడేమోననే అనుమా నాలు లేకపోలేదు. ఏమో.... రాజకీయాలలో ఏమైనా జరగొచ్చు. పార్టీలో చంద్రబాబుపై తిరుగుబాటు రావచ్చు... తిరిగి ఎన్టీఆర్ వారసుల చేతికే పార్టీ పగ్గాలు పోనూపోవచ్చు! ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో చాలామంది నాయకులు కోరుకుంటున్నది కూడా ఇలా జరగాలనే!

# పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ



జడ్పీ వాకర్స్ అసోసియేషన్ దాతృత్వంతో, టి.మహేష్ సహాయ సహకారాలతో ఈనెల 10న నెల్లూరు, వేదాయపాళెం, సావిత్రినగర్, చంద్రమౌళినగర్ ప్రాంతాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అనంతరం జడ్పీ వాకర్స్ కార్యదర్శి మెట్టు సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. గౌరవ సలహాదారు జేయస్ఆర్ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఎస్తేరు రాణి, ఎబినెజర్, మేరీ బ్లెస్సింగ్టన్, డి.అరుణ, వై.దయాకర్‌రెడ్డి, సుజన, తుషిత, దీపా సరస్వతి, షేక్ రసూల్, సుబహాన్, రాజేష్, ఎం.రమణారెడ్డి, ప్రసాద్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

# అనిల్ Vs ఆనం

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిణామాలు అటు ఇటు తిరిగి ఆనం వర్సెస్ అనిల్ అన్నట్లుగా మారు తున్నాయి.

## పునాది పడింది అక్కడే!

2019 ఎన్నికలకు ముందే ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంను వీడి వైసిపిలో చేరడం జరిగింది. ఆరోజు తెలుగుదేశంలో కొనసాగడం ఇష్టం లేక ఆయన వైసిపిలో చేరాడు. జగన్మోహన్‌రెడ్డి కూడా 2014లో చేసిన పొరపాటు చేయకూడదని, పార్టీ లోకి వస్తామన్న వారిని వద్దనకూడదనే కోణంలో ఆనం రామనారాయణరెడ్డిని పార్టీలోకి తీసుకోవడమేకాక వెంకట గిరి అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చాడు. ఆనం రామనారాయణరెడ్డికి గెలిచే పార్టీ కావాలి, జగన్మోహన్‌రెడ్డికి వెంకటగిరి నుండి గన్‌షాట్‌గా గెలిచే అభ్యర్థి కావాలి కాబట్టి అక్కడ పరస్పర అవస రాలు తీరిపోయాయి.

వైసిపి అధికారంలోకి వచ్చినా సీని యార్టీ కోటాలో ఆనం రామనారా యణరెడ్డికి మంత్రి పదవి రాదనేది ఊహించిన విషయమే! జగన్ రాజ కీయ సీనియార్టీ కంటే తన పట్ల చూపిస్తున్న సిన్సియార్టీకే పెద్దపీట వేస్తూ ఈ జిల్లా నుండి పి.అనిల్‌కుమార్ యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలకు మంత్రి పదవులిచ్చాడు.

అయితే ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొన్ని నెలల్లోనే జరిగిన పరిణామాలు ఆనంలో అసంతృప్తిని రాజేశాయి. వెంకటగిరి నియోజకవర్గం పరిధిలో ఆల్తూరుపాడు ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనిని రద్దు చేసి సింగిల్ టెండర్ పిలవడం, అలాగే ఎన్నో ఏళ్లుగా ఆనం ఆధి పత్యంలో కొనసాగిన నెల్లూరులోని విఆర్ విద్యాసంస్థలు, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ వంటి అంశా లలో మంత్రి అనిల్ చేసుకున్న జోక్యం ఆనంలో ఆగ్రహానికి కారణమైంది. గతంలోనే ఈ అంశాలపై ఆనం రామనారాయణరెడ్డి తీవ్రస్థాయిలో బహిరంగంగానే అసంతృప్తి వెలిబు చ్చాడు. తాజాగా మరోసారి కూడా ఆయన అధికారులపై నెపంతో చేసిన ఆరోపణలు మంత్రి అనిల్‌ను లక్ష్యంగా చేసుకున్నవే!

## ఆనం కుటుంబం మళ్ళీ ఒక్కటవుతుందా?

ప్రతిపక్షంలోవున్న రోజుల్లో కూడా జిల్లాలో ఆనం వాళ్ళ హవా కొనసా గింది. నెల్లూరు నగరంపై దాదాపు 20ఏళ్ళ పాటు ఆధిపత్యం చూపారు. 2014 నుండి జిల్లాలో ఆనం రాజ కీయ ప్రాబల్యం తగ్గింది. ఇందులో వాళ్ళు రాజకీయంగా చేసుకున్న పొర పాట్లు ఒక కారణమైతే... వారింట వచ్చిన కుటుంబ కలహాలు మరో కారణం. ఒకప్పుడు మంత్రి అనిల్ కూడా ఆనం రాజకీయ శిక్షణా కేంద్రంలో విద్యార్థే! కాలక్రమంలో ఆనంకు దూరమై, మారిన రాజకీయ పరిణామాలతో ఆనంకు రాజకీయ విరోధిగా మారడం తెలిసిందే! ఇప్పుడు ఇరువురూ ఒకే పార్టీలో వున్నప్పటికీ ఆ పాత వైరాన్ని మరచిపోవడం లేదు. ఆనంను లక్ష్యంగా చేసుకుని అనిల్ తన పని తాను చేస్తుంటే, అదే సమ యంలో అనిల్‌పై రాజకీయ దాడికి ఆనం సంసిద్ధమయ్యాడు. ఈ కోణం లోనే ఈమధ్య తెలుగుదేశం పార్టీలో వున్న ఆనం వెంకటరమణారెడ్డి కూడా తెరమీదకొచ్చాడు. తెలుగు దేశం వైపు నుండి ఆయన మంత్రి అనిల్ వైపు విమర్శలు ఎక్కుపెడుతున్నాడు. నీకు రాజకీయ భిక్ష పెట్టింది ఆనం కుటుం బమేనంటూ ఒకప్పుడు తాను విభేదిం చిన ఆనం సోదరులను వెనకేసుకొ చ్చాడు. దీన్నిబట్టి చూస్తే మంత్రి అనిల్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా ఆనం సోదరులు ఒకటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అనిల్ ఎదుర్కొంటాడా?

నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వంటి రాజకీయ యోధుడికే చుక్కలు చూపిం చిన వాళ్ళు ఆనం సోదరులు. పెద్ద పెద్ద వర్గబలమున్నోళ్ళు కూడా ఆనంను ఎదుర్కోలేకపోయారు. అయితే ఆనం వర్గం అప్పట్లో వున్నంత బలంగా ఇప్పుడు లేదనుకోవచ్చు. అయినా జిల్లాలో ఇప్పటికీ వాళ్ళదే పెద్ద రాజకీయ వర్గం. అలాంటి ఆనం వర్గాన్ని అనిల్ ఎదుర్కోగలడా? మంత్రి అనిల్ వైపు నుండి చూస్తే జిల్లాలో తొలి బి.సి మంత్రి. 'రెడ్డి' ప్రాబల్యం ఉండే నెల్లూరు నగరంలో వరుసగా రెండుసార్లు గెలవడం చిన్న విషయం కాదు. అనిల్‌కు సొంతంగా వర్గం లేకున్నా జగన్ బలమే ఆయనకు పెద్ద అండ. వర్గ బలం కంటే జగన్ పట్ల విశ్వాసమే తనను నిలబెడుతుందన్నది అనిల్ నమ్మకం. కాబట్టే ఆనంను మొండిగా ఢీకొడుతున్నాడు. చూద్దాం.. రానురాను ఈ పరిణామాలు ఎలాంటి రాజకీయ వైపరీత్యాలకు దారి తీస్తాయో..?

# నెల్లూరు నేతలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ శ్రేణులను మళ్ళీ ప్రోది చేసుకునే దిశగా తెలుగుదేశం అధిష్టానం కసరత్తు మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఇప్పుడు ఏపి పార్టీ అధ్యక్ష పదవి కీలకంగా మారింది. రాష్ట్రంలో పార్టీకి బీసీలెంత కీలకమో, రెడ్లు కూడా అంతే కీలకం. అందుకే ఈ రెండు వర్గాలలో ఒకరికి పార్టీ అధ్యక్ష పదవి దక్కే అవకాశా లుండగా, ఆ రెండు వర్గాల నుండి పేర్లు కూడా నెల్లూరుజిల్లా నుండే విని పిస్తుండడం విశేషం.

## 'రెడ్డి' అయితే సోమిరెడ్డి

ఏపి పార్టీ అధ్యక్ష పదవిని 'రెడ్డి' వర్గానికి ఇవ్వాలనుకుంటే ఆ క్రమంలో వినిపిస్తున్న మొదటిపేరు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. సర్వేపల్లి నుండి వరుస ఓటములున్నప్పటికీ పార్టీ పరంగా ఆయన ట్రాక్ రికార్డు బాగుంది. పార్టీ సిద్ధాంతాలకు నమ్మిన బంటు. ప్రత్యర్థులపై విమర్శల దాడిలో దిట్ట. ప్రస్తుతం పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా వున్నాడు. వైయస్ జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడంలో ముందుంటాడు. ఈ సమయంలో పార్టీ అధ్యక్షుడిగా 'రెడ్డి' సామాజిక వర్గానికి చెందిన సోమిరెడ్డిని నియమించడమే కరెక్ట్ అని కొందరి అభిప్రాయం.

## బీసీ అయితే బీద

అదే సమయంలో పార్టీకి నిన్నటి ఎన్నికల్లో దూరమైన బి.సి.లను తిరిగి పార్టీ గూటికి చేర్చడానికి పార్టీలో ఆ వర్గం ప్రాధాన్యతను పెంచాలనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బిసి వర్గాలకు కట్టబెట్టాలనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది. ఈ కోణంలో చూస్తే నెల్లూరు జిల్లాకే చెందిన బీసీ వర్గ నాయకుడు, ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వున్న బీద రవిచంద్ర కనిపిస్తాడు. రవిచంద్రకు కూడా పార్టీలో మంచి రికార్డు వుంది. గతంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా సమర్థవంతంగా పనిచేసి వున్నాడు. హుషారుగా పనిచేసే తత్వముంది. కష్ట నష్టాలలో పార్టీని వెన్నంటే వుంటున్నాడు. కాబట్టి బి.సిల వైపు నుండైతే బీద పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తుండడం విశేషం!

మొత్తానికి ఈసారి తెలుగుదేశం ఏపి అధ్యక్ష పదవికి ఇద్దరు నెల్లూరు నాయకుల పేర్లే ప్రచారంలో ఉండడం గమనార్హం.

# రెండు వారాల గడువు

(మొదటి పేజీ తరువాయి)

లేకున్నా కరోనా నియంత్రణల కేరళ సీఎం తర్వాత స్థానంలో నిలిచాడు. సీని యర్లను దాటుకుని దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ముఖ్యమంత్రులలో నాలుగోస్థానంలో నిలిచాడు. ఏడాదిలోనే ఇన్ని విజయాలు సాధించిన ఏ.పి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి... ఒక్క న్యాయస్థానాలను మాత్రం మెప్పిం చలేకపోతున్నాడు. ఆయన నిర్ణయాలను కోర్టులు పదేపదే తప్పుపడుతున్నాయి.

పలు కేసుల్లో ఇప్పటికే న్యాయస్థానాలు వైయస్ జగన్మోహన్‌రెడ్డి సర్కార్ విధానాలను తప్పుపట్టగా, తాజాగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ కేసులోనూ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌నే కొనసాగించాలని మే29న హైకోర్టు తీర్పు ఇవ్వగా, ఈ తీర్పుపై స్టే కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. అయితే జూన్ 10వ తేదిన సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఈ కేసులో రెండువారాల తర్వాత పూర్తిస్థాయి విచారణ జరుపుతామంటూ ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది.

ఇటీవల న్యాయస్థానాలలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగానే తీర్పులొస్తు న్నాయి. అంతమాత్రాన రాష్ట్ర ప్రభుత్వం ఏదో కోల్పోయినట్లు కాదు. వంద నిర్ణయాలలో ఒకట్రెండు ప్రతికూల ఫలితాలు చూపవచ్చు. ముఖ్యంగా జగన్ సర్కార్ ప్రజాకోర్టులో గెలుస్తోంది. ప్రజాదరణలో దూసుకుపోతోంది. తమ నిర్ణయాలలో చిత్తశుద్ధి వుందని, ప్రజాశ్రేయస్సే ఆ నిర్ణయాల లక్ష్యమని కోర్టులను ఒప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిభాగాన్ని అభివృద్ధి చేసుకోవాల్సివుంది.

## అవకాశాలు వస్తాయా?

# ఆశలు ఫలిస్తాయా?

*కోవిడ్ వచ్చిన కొత్తల్లో భారతీయులం గజగజ వణికాం. అసలే ఆర్థిక పరిస్థితి బాగా లేదు, మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు యిదొకటా, దేశం ఓ పదేళ్లు.. కాదు, కాదు.. యిర్వై ఏళ్లు వెనకబడిపోతుంది అని తల్లడిల్లాం. కానీ ఇటీవల మనకు ఆశాభావం పుట్టుకుని వచ్చి, దీనివలన మనకు మంచే జరుగు తుంది అనుకుంటున్నాం. దేనివలన? ప్రపంచమంతా కరోనా విషయంలో చైనాపై ఆగ్రహంగా వుంది కాబట్టి, విదేశీ సంస్థలన్నీ తమ యూనిట్లను చైనా నుంచి తరలించి భారత్‌లో నెలకొల్పుతాయని, కొత్తగా యూనిట్లు కూడా మనకే వస్తాయని అనుకుంటున్నాం. ప్రతి ప్రమాదాన్ని అవకాశంగా మలచుకుంటాం అని మన నాయకులు చెప్పిన దాన్ని విశ్వసిస్తున్నాం. దీని కారణంగా మన దేశం ఆర్థికంగా ఎక్కడికో వెళ్లిపో తుందని అంచనాలు వేస్తున్నాం.*



**కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి**
వ్యవస్థాపక చైర్మన్, శాంతా బయోటెక్

ఆశావాహ దృక్పథం వుండడం మంచిదే, కానీ క్షేత్రస్థాయి వాస్తవాలను కూడా లెక్కలోకి తీసుకోవాలి కదా! మన దేశంలో ఉత్పత్తి రంగం ఎలా వుంది? దానికి చోదకశక్తి ఐన పరిశోధనా రంగం ఎలా వుంది అనేది గమనించాలి. 1991లో గ్లోబలైజేషన్ తర్వాత నుంచి మనం మాన్యుఫేక్చరింగ్ రంగాన్ని అశ్రద్ధ చేస్తూ వచ్చాం. ఏదైనా వస్తువును కష్టపడి తయారు చేసుకునే బదులు దిగుమతి చేసేసుకుంటేపోయె కదా అనే ఆలోచనా ధోరణి ప్రబలింది. దేశీయ పరిశ్రమలను పాడుపెట్టి, దిగుమతులు ప్రోత్సహిస్తూ పోయాం. అలా దిగుమతి అయిన వాటిలో కొన్ని నాణ్యత విషయంలో మిన్నగా వుండడం, కొన్ని ధర విషయంలో చౌకగా వుండడం వలన స్వదేశీ వస్తువులపై ఆదరణ తగ్గింది. మన సమాజంలో విదేశీ బ్రాండ్ల లేబుల్‌పై మోజు పెరిగి నాణ్యత, ధర విషయం పట్టించుకోకుండా కొనే ధోరణి పెరగడంతో కూడా స్థానికంగా తయారయ్యేవి అమ్ముడుపోని దుస్థితి దాపురించింది.

మన జిడిపిలో మ్యాన్యుఫేక్చరింగ్ రంగం వాటాలో మార్పులను దశాబ్ద కాలంలో చూసుకుంటే 2008లో 32% ఉండగా, అది 2011 నాటికి 30%, 2014 నాటికి 27% తగ్గుతూ వచ్చింది. 2018-19 నాటికి అది 29.6%కి చేరింది. (pl see the note below) దేశప్రజల్లో అత్యధిక జనాభాకు ఉపాధి కల్పించే వ్యవసాయరంగం వాటా కూడా 17% నుంచి 14%కు పడిపోయింది. మరి సర్వీసు రంగం చూడబోతే 2008లో 45% ఉన్నది 2018 వచ్చేసరికి 52% అయింది. అంటే మన విద్యావంతులు విదేశీ సంస్థలకు రకరకాల సేవలందిస్తూ జిడిపిని పెంచుతున్నారు తప్ప, స్వయం ఉపాధి కల్పించుకోలేక పోతున్నారన్నమాట. ఐటీ రంగంలో అయితే ఓ రకంగా బాడీ షాపింగ్ స్థాయికి దిగజారిపోయామన్నది అనటానికి, వినటానికి కష్టంగానే వున్నా వాస్తవమైతే అదే.

ఇక చైనా 1990లో ప్రపంచ ఉత్పత్తిలో 3% వాటా నుంచి ప్రస్తుతానికి దాదాపు 50% వాటాకు చేరింది. మన దేశంలో యీ పతనానికి కారణాలు అనేకం ఉన్నాయి. పరిశ్రమలకు సంబంధించి చేసిన చట్టం 1941 నాటిది. దానిలో బాయిలర్ హౌస్ గురించి కూడా ప్రస్తావన వుంటుంది. ఈనాడు అత్యాధునికమైన సాంకేతికతతో నడుస్తున్న పరిశ్రమలు కూడా సంబంధిత శాఖ నుంచి సర్టిఫికెట్టు తెచ్చుకోవాలి. ఓ పట్టాన ఫైళ్లు కదలవు. రోజుకి యిన్ని ఫైళ్లు కదల్చాలని, యిన్ని నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వోద్యోగులకు టార్గెట్లు ఉండవు. ఏ నిర్ణయం తీసుకుంటే తనకు రిటైర్‌మెంటు వేళ ముప్పు వస్తుందోనన్న భయంతో ఉద్యోగులు వాయిదాలు వేస్తూ గడిపేస్తారు.

ప్రతి శాఖలో యిలాటి అడ్డంకులు బోల్డు. అనేక శాఖల సమన్వయం కుదిరితే తప్ప పరిశ్రమలు ప్రారంభించలేం. కంట్రోళ్లు తీసేశాం, లైసెన్సింగ్ విధానం సరళీకృతం చేశాం, సింగిల్ విండో పెట్టాం అంటారు కానీ గోదాలోకి దిగినప్పుడే తెలుస్తుంది... అవన్నీ ఒట్టి నినాదాలే అని. చట్టాల్ని ఆధునీకరించి, ప్రభుత్వ కార్యాలయాలలో రెడ్‌టేప్ అనేది లేకుండా చేసినపుడే ఔత్సాహికులు ఈ రంగంవైపు చూపు సారిస్తారు. ప్రస్తుత పరిస్థితిని అత్యయిక పరిస్థితిగా చూపి ప్రభుత్వం అనేక అధికారాలను చేజిక్కించుకుంటోంది. ఈ 'అత్యయిక పరిస్థితి'లోనే ఈ మార్పులన్నీ రోజుల వ్యవధిలో చేయాలి. ఇక సమాజం కూడా పారిశ్రామికవేత్తను దోపిడీదారుగా చూస్తుంది. ఇతర దేశాల్లో పరిశ్రమలకు ప్రభుత్వం భూమి యివ్వడం సర్వసాధారణం. ఇక్కడ ప్రభుత్వం చౌకధరకు యిచ్చినా, వెంటనే మీడియా, ప్రజలు ఏకేస్తారు. అది నిరుపయోగకరమైన భూమి ఐనా, మార్కెట్ రేటు కంటే ఎక్కువ పెట్టి కొన్నా ప్రభుత్వాధినేతకు లంచాలిచ్చి సాధించుకున్నాడని ఆరోపిస్తారు. ఆ స్థలానికి రోడ్డు వేసినా, కరంటు, నీళ్లు యిచ్చినా గగ్గోలు పెట్టేస్తారు.

స్థానికులకు నైపుణ్యం లేకపోయినా ఉద్యోగాలు యిచ్చి తీరాలని పట్టుబడతారు. స్థానిక ప్రజాప్రతినిధులు వచ్చి బెదిరిస్తారు. ఎన్నికలకు నిధులివ్వమంటారు. ఇంతా చేసి పర్యావరణాన్ని పాడు చేస్తున్నాయని ఆరోపిస్తారు. పాడు చేసిన సందర్భాల్లో తప్పకుండా నిలదీయాలి. కానీ కాలుష్యం కలిగే అవకాశమే లేని పరిస్థితుల్లో కూడా ఇలాంటి ఆరోపణలు గుప్పిస్తారు.

ఊరవతల ఫ్యాక్టరీ వెలిసినప్పుడు అక్కడ జనావాసమే ఉండదు. తర్వాత చుట్టూ కాలనీలు వెలుస్తాయి. పారిశ్రామికవాడలో వసతి గృహాలు అనుమతించము అని ప్రభుత్వం అనదు. చిత్తమొచ్చినట్లు యిళ్లు కట్టనిస్తుంది. ఓ 20, 30 ఏళ్లకు ఇళ్ల మధ్య ఫ్యాక్టరీ ఏమిటి, తీసేయాలి అని సామాజిక కార్యకర్తలు ఆందోళన మొదలుపెడతారు. భారీ యంత్రసామగ్రిని తరలించడం, రవాణా సౌకర్యాలను వదులుకోవడం, కొత్త ప్రదేశంలో విద్యుత్, నీరు ఏర్పాటు చేసుకోవడం ఎంత కష్టం? ఇలాంటి పరిస్థితులు కూడా మారాలి.

ఇల్లలకగానే పండగ కానట్లు, వస్తువులు తయారుచేయగానే సిరులు కురవవు. వాటిలో నవ్యత, నాణ్యత ఉండాలి. అప్పుడే స్థానికంగా కానీ, విదేశాలలో కానీ మార్కెట్ వుంటుంది. పరిశ్రమ నిలదొక్కుకుంటుంది. ఆర్ అండ్ డి (పరిశోధన, అభివృద్ధి) ఉన్నపుడే మన ఉత్పాదనకు ఎడ్జ్(యితరుల కంటే మెరుగనిపించుకోవడం) ఉంటుంది. అయితే దేశంలో ఆర్ అండ్ డి పరిస్థితి ఏమిటి? దాని గురించి కాస్త విపులంగా చర్చించుకోవాలి. 2017లో ఆర్ అండ్ డి పై ఖర్చయినది 1.7 ట్రిలియన్ (అంటే లక్ష కోట్ల) డాలర్లు. దానిలో అగ్రస్థానం అమెరికా, చైనా, జపాన్‌లది. భారత్ వాటా 2.8%. దీనిలో ప్రభుత్వపు వాటా, ప్రయివేటు వాటా కూడా కలిసి వుంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఏయే దేశాలు పరిశోధనపై ఎంతెంత ఖర్చు పెడుతున్నాయో పోల్చి చూడాలంటే జిడిపిలో జిఇఆర్‌డి (గ్రాస్ ఎక్స్పెండిచర్ ఆన్ ఆర్ అండ్ డి) శాతం తెలుసుకోవాలి. అప్పుడే ఎంత చెట్టుకు ఎంత గాలి వీస్తోందో తెలుస్తుంది. అమెరికాలో 2.8%, చైనాలో 2.1% ఇజ్రాయేలులో 4.3%, కొరియాలో 4.2% ఉంటే ఇండియాలో కేవలం 0.6%-0.7% మధ్య ఉంటోంది. 1990లోనూ అంతే, యిప్పుడూ అంతే.

2004-05లో పరిశోధనలలో ప్రభుత్వ పెట్టుబడి 18 వేల కోట్లు అంటే నామినల్ జిడిపిలో 0.5%, ప్రయివేటు పెట్టుబడులు 6 వేల కోట్లు అంటే 0.2%. 2008-09లో ప్రభుత్వంది 33 వేల కోట్లు (0.5%), ప్రయివేటుది 14 వేల కోట్లు (0.2%). 2012-13లో ప్రభుత్వంది 47 వేల కోట్లు (0.4%), ప్రయివేటుది 27 వేల కోట్లు (0.2%). 2016-17లో ప్రభుత్వంది 61 వేల కోట్లు (0.4%), ప్రయివేటుది 44 వేల కోట్లు (0.3%). ఎలా చూసినా మొత్తం 7% దాటటం లేదు.

ప్రభుత్వం తన శాఖల ద్వారా చేయించే పరిశోధనలలో ఎ) డిఫెన్స్, ఎటామిక్, స్పేస్‌లపై దాదాపు మూడింట రెండు వంతులు ఖర్చవుతోంది. బి) సైన్స్, టెక్నాలజీకి సంబంధించినవాటిపై 22%, సి) మెజారిటీ జనాభా ఉపాధికి ఆధారభూతమైన వ్యవసాయంపై 12% ఖర్చు చేస్తూ డి) ఆరోగ్యపరిశోధనలపై 3% ఖర్చు చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం ఎంత పొరపాటో కరోనా మనకు బుద్ధి చెప్పింది. వీటి వివరాలలోకి వెళితే...

ఎ) గ్రూపులో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రిసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్), డిఏఇ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎటామిక్ ఎనర్జీ), డిఓఎస్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్) ఉన్నాయి. 2010-11లో పరిశోధనలపై ప్రభుత్వం పెట్టిన మొత్తం ఖర్చు 63% దీనికే పోయింది. అంటే 2012-13లో 63%, 2014-15లో 67%, 2017-18లో 62%. మొదటి దానిపై 32-38%, రెండవదానిపై 10-12%, మూడోదానిపై 16-19% ఖర్చవుతున్నాయి.

బి) గ్రూపు కింద ఉన్న సిఎస్‌ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసెర్చ్), డిబిటి (డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ), డిఎస్‌టి (డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ)ల వాటా 2010-11లో 22%, 2012-13లో 22%, 2014-15లో 21%, 2017-18లో 21% మొదటిదానిపై 10-11%, రెండవదానిపై 3-4%, మూడవదానిపై 7-8% ఖర్చవుతున్నాయి.

సి) గ్రూపులో ఉన్న ఐసిఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్రికల్చరల్ రిసెర్చ్)పై 2010-11లో 12%, 2012-13లో 12%, 2014-15లో 11%, 2017-18లో 11% ఖర్చయ్యింది.

డి) గ్రూపులో ఉన్న ఐసిఎమ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్)పై 2010-11లో 3%, 2012-13లో 3% 2014-15లో 2.4%, 2017-18లో 3% ఖర్చయ్యింది.

పరిశోధనలలో ఖర్చు రీత్యా ప్రభుత్వ వాటా ఎంతో, ప్రయివేటు సంస్థల వాటా ఎంతో చూద్దాం. 2017-18లో మొత్తం ఖర్చులో కేంద్రప్రభుత్వ వాటా 45%, ప్రయివేటు సెక్టార్ ఇండస్ట్రీ వాటా 37%, స్టేట్ సెక్టార్ వాటా 6%, పబ్లిక్ సెక్టార్ ఇండస్ట్రీ వాటా 5%, యూనివర్సిటీలు, యితర విద్యా సంస్థల వాటా 7%. పబ్లిక్ సెక్టార్ సంస్థలు తమ సేల్స్‌లో 0.3% పరిశోధనలపై ఖర్చు పెడితే, ప్రయివేటు సెక్టార్ సేల్స్‌పై 1.5% ఖర్చుపెడుతోంది. లాభదాయకమైన 257 పబ్లిక్ సెక్టార్ యూనిట్లలో 25% మాత్రమే పరిశోధనపై వెచ్చించాయి.

ఒక పబ్లిక్ సెక్టార్ యూనిట్ ఆర్ అండ్ డికి, మరోదానికి లింకు లేదు. ఒకరు కొంతవరకు చేస్తే తక్కినది మరొకరు అందిపుచ్చుకునేట్లు చేసే సంస్థాగతమైన సమన్వయ శాఖ లేదు. దానివలన ఒకే దానిపై రెండు సంస్థలు పరిశోధించే ప్రమాదం వుంది. పబ్లిక్ సెక్టార్ సంస్థల్లో ఆ మాత్రమైనా ఖర్చుపెట్టినది డిఫెన్స్, ఫ్యూయల్, ఇండస్ట్రియల్ మెషినరీపై కాగా, ప్రయివేటు సెక్టార్ సంస్థలు ఖర్చు పెట్టినది డ్రగ్స్, ఫార్మా, ట్రాన్స్‌పోర్టేషన్, ఐటీ, మెకానికల్ ఇంజనీరింగ్, ఇండస్ట్రీస్ వగైరా. **(సశేషం)**


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు






ఉత్తరక్రియలు
ఆప్యాయతానురాగాలతో, మంచితనానికి మారుపేరుగా నిలిచి,
మా అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించిన
మానవతామూర్తి, భక్తితత్వ పరాయణులు
శ్రీ కోట మస్తాన్‌రెడ్డి గారు
తేది. 08.06.2020న స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
- కుటుంబసభ్యులు
ఉత్తరక్రియలు: తే. 18.06.2020ది గురువారం
అల్లూరుపేటలోని వారి స్వగృహమునందు జరుగును.
కావున తెలియజేయడమైనది.





Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com